అభ్యుదయ

ఏప్రిల్ 1978



మాక్సిం గోర్కీ 110 వ జయంతి

త్వరలో విడుదల!

తీర్పుకు తర్వాత వస్తున్న మార్పు

భార్యాభర్తల అనుబంధానికి
కాలమానం డబ్బుకాదు.





ఇంటర్నేషనల్ సినిమా వారి

మార్పు (కలర్)

నిర్మాణం - దర్శకత్వం:
LION. పి. విశ్వేశ్వరరావు B.Sc.,

శ్రీఫిలింస్. శ్రీతారకరామ. సుధా చిత్ర

జాలి పడవలసిన దేశం!

ఖలీల్ జిబ్రాన్

[ప్రపంచ ప్రసిద్ధుడైన లెబనాన్ తాత్త్విక కవి]

నమ్మకాలతో నిండిపోయి,
మత శూన్యమైన దేశం—
జాలి పడవలసిన దేశం

తాను నేయని బట్టను,
తాను పండించని తిండిని,
తనదు చెందని భోగాలను
అనుభవించే దేశం—
జాలి పడవలసిన దేశం

క్రూరుణ్ణి వీరునిగా,
విజేతను ఉదారునిగా
భజన చేసే దేశం—
జాలి పడవలసిన దేశం

కలలో కోర్కెను నిరసించి,
మేలుకున్నప్పుడు దానికి లొంగేది—
జాలిపడవలసిన దేశం.

శవం వెంట నడిచేటప్పుడు తప్ప
ఎలుగెత్తని దేశం,
శిథిలాల మధ్య తప్ప
కీర్తించని దేశం,
నెత్తిపైకి కత్తి వచ్చినప్పుడు తప్ప
తిరగబడని దేశం—
జాలిపడవలసిన దేశం.

నక్కలు రాజకీయవేత్తలుగా,
ఇంద్రజాలికులు తత్త్వవేత్తలుగా
అతుకులు పెట్టేదీ, అనుకరించేది కళగా
వెలుగుతూవున్న దేశం—
జాలి పడవలసిన దేశం,

క్రొత్త పాలకుడికి హారతులతో
స్వాగతం చెప్పి,
అతనినే కేరింతలతో సాగనంపే దేశం,
ఇంకొకణ్ణి మళ్ళీ హారతులెత్తి
ఆహ్వానించే దేశం—
జాలి పడవలసిన దేశం.

మునులు ఏళ్ళతరబడి మౌనులుగా
బలోపేతులు ఉయ్యాలలో పసివాళ్ళుగా
ఉంటూవుండే దేశం—
జాలి పడవలసిన దేశం.

చెక్కలుగా ముక్కలయిపోయి,
ప్రతిచెక్కా తానొక జాతి ననుకునే దేశం
జాలి పడవలసిన దేశం.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం

అభ్యుదయ

మద్రాసు శాఖ మాస పత్రిక ప్రత్యేక సంచిక

సంచిక : 4 సంపుటి ; 2] ఏప్రిల్ 1978 [సాలు చందా రూ. 1

కవితావేశంలో పిశాచానికి వశమై తన కుగాదులు, ఉషస్సులు లేవని ఒకనాడు వ్యక్తిగతంగా చెప్పిన కవి వాక్కు, యీనాడు దేశం స్వగతంగా చెప్పుకుంటోన్న వాక్కుగా వుంది. సుఖశాంతులు లేని దేశంలో వచ్చే పండగలు పండగలుగా వుండవు సరికదా దండగలుగా పరిణమిస్తాయి. వచ్చి పోతుంటే అలవాటు ప్రకారం జరుపుకోవడం తప్పితే, రకరకాల దిగుళ్ళ వల్ల పండగలు ప్రజలకు ఆరాటాలు లేని ఆనందం కలిగించవు - సహజమే.

ప్రజలకు సంతుష్టిని,సంతోషాన్నిచ్చే దేశసంపదలు వేగంగా కాకపోయినా, నింపాదిగా అయినా సృష్టి అవుతూనే వున్నాయి, వృద్ధి అవుతూనే వున్నాయి. అయితే ఆ సృష్టి వెంబడినే లయమూ జరుగుతూనే వున్నది. సృష్టి అవుతూన్న సంపదలు, వాటి సృష్టికర్తలైన శ్రామికులకు, సామాన్య ప్రజలకు అందకుండా చేసే దుర్వ్యవస్థ దేశంలో స్థిరపడి వుంది. ధనిక, దళారీ వర్గాలు దేశ సంపదను అపహరించడానికీ, ఆ వర్గాలు నానాటికీ ప్రబలం కావడానికీ సదుపాయాలు, రక్షణలు కల్పించే విధానం దేశంలో స్థిరపడి వుంది. అది సమూలంగా నిర్మూలనమై, శ్రమించి సృష్టి చేసే అశేష ప్రజానీకానికి దేశ సంపదలను అనుభవంలోకి తెచ్చే సాంఘిక వ్యవస్థ సుస్థాపితం కానంత కాలం ప్రజలకు సుఖశాంతులు గగన కుసుమాలుగా వుండక తప్పదు.

ఇది సర్వసామాన్యమైన సత్యం. పరశ్రమోప జీవులకు సైతం తెలియనిది కాదు. కాని వాళ్ళు తెలియనట్టు నటిస్తూ, దేశాన్ని పీడిస్తున్న జాడ్యాలకు బూటకపు చికిత్సలు చేస్తుంటారు; ప్రజలు సత్యాన్ని గ్రహించకుండా, వారి దృష్టిని చిల్లర విషయాలపైకి మళ్ళిస్తుంటారు.

ఈ సత్యాన్ని సంపూర్ణంగా అవగతం చేసుకున్నవారు సైతం, యీ అరిష్ట నివారణకు ఉద్యుక్తులు కాకపోవడమే కాకుండా, అనైక్యతతో, అంధకారంలో - దారి తెలిసి కూడా ముళ్ళ దారిలో ప్రయాణం చేస్తున్నారు.

ముప్ఫయ్యేళ్ళుగా స్వరాజ్యం సురాజ్యం అవలేదు. వాగ్దానాలు వినడానికి ప్రజలు అలవాటు పడిపోయారు. అవి సఫలమయ్యే కాలం మాత్రం కను చూపు మేరలో కనిపించడంలేదు. వాగ్దానాలకే కాకుండా, ప్రజలు వాటి వాయిదాలకూ అలవాటు పడ్డారు. ఇటువంటి పరిస్థితిలో వచ్చే ఉగాదులు నామమాత్రంగా, కాలచక్ర భ్రమణం ప్రతిధ్వనిగా వుండక తప్పదు. .

ఉగాదులు, ఉషస్సులు

శ్రామికజన జీవన సమర గాథాశిల్పి గోర్కీ

(1868-1978)

నూట పదేళ్ళ క్రితం రష్యాలోని నిరుపేద కుటుంబంలో పుట్టి, బాల్యం నుండీ పొట్ట పోసుకునేందుకు పాచి పనివంటి పనులు చేస్తూ, అతి క్రూరుడైన తాతగారి పోషణలో పడరాని పాట్లుపడి, బికారి జీవితం గడుపుతూ; దుర్భర దారిద్ర్యావస్థలో వుండిన ఆనాటి రష్యాలో దేశం ఒకమూలనుండి యింకో మూలకు తిరుగులాడుతూ, స్వయం కృషితో ప్రపంచ విఖ్యాత సాహిత్య వేత్త అయిన మాక్సిం గోర్కీ 110వ జన్మదినోత్సవ సంవత్సరం యిది. తన చేదు జీవితానుభవం (గోర్కీ అన్న తన కలం పేరుకు చేదు అని అర్థం) నుండి తన దేశ ప్రజలకు, ప్రపంచ దేశాల ప్రజలకు మధుర జీవిత సృష్టికి, అత్యంత మనోహర జీవిత సృష్టికి ప్రోత్సాహాన్ని, ఉత్తేజాన్ని కలిగించిన, ప్రపంచ సాహిత్యంలోని చిరస్మరణీయుడు గోర్కీ.

ప్రపంచ సాహిత్య వేత్తలలో గోర్కీ విశిష్టత ప్రత్యేకమైనది, సాటిలేనిది. ఆయన రచనలు ఉన్నత ప్రమాణాలున్నవనో, జీవితానుభవాన్ని కాచి వడపోసినవనో చెపితే అది సాటిలేని గోర్కీ విశిష్టతకు సంపూర్ణ వివరణ కాదు. ఆయన సాహిత్యమంతా శ్రామిక ప్రజల విముక్తి సమర ఆయుధాగారం. ప్రపంచ సాహిత్య వేత్తలలో గోర్కీ ప్రత్యేకత, విశిష్టత యిది. ఈ విషయంలో గోర్కీకి సాటి రాగల వారెవరూ లేరు.

తెలుగు పాఠకులకు గోర్కీ రచనలనేకం సుపరిచయమైనవి. వీటిలో ముఖ్యంగా "అమ్మ", గోర్కీ దేశమైన రష్యాలోనూ, ఎన్నో ఇతర దేశాలలోనూ నిర్వహించిన విప్లవకర పాత్రనే ఆంధ్రప్రజల జాతీయోద్యమంలోనూ, శ్రామిక ప్రజోద్యమంలోనూ నిర్వహించిందన్న సత్యం తెలిసినదే. నాలుగైదు దశాబ్దాల క్రితం జైలుశిక్ష ననుభవిస్తోన్న ఒక జాతీయవాది, శ్రీ క్రొవ్విడి లింగరాజు కాగితాన్ని, పెన్సిల్‌నూ రహస్యంగా సంపాదించి యీ మహత్తర గ్రంథాన్ని తెనిగించి చాటుగా దానిని వెలుపలకు పంపడమూ, అది అచ్చయిన తరవాత పెద్దగా ప్రాచుర్యానికి రావడమూ, బ్రిటిష్ ప్రభుత్వం దానిని నిషేధించినా ప్రజలలో అది వ్యాపించడమూ "అమ్మ" మన ప్రజల విముక్తి సమరాని కిచ్చిన ఉత్తేజాన్ని తెలుపుతాయి. అది తెలుగు సాహిత్యాన్ని ఎంతో ప్రభావితం చేసింది కూడా.

రచయితగా గోర్కీ జీవితం రష్యాలో విప్లవోద్యమం అంకురిస్తోన్న కాలంలో మొదలయ్యింది. కార్యాచరణ కుద్యుక్తమైన రష్యా ప్రజల మానసిక స్థితిని, ఆ కాలపు గోర్కీ కథలు చిత్రిస్తాయి. ఆయన తొలి రచనలు అథమ స్థితిలో వున్నవారి జీవితాలను—చేతి వృత్తులవారి, బికారుల, స్వాప్నికుల, తిరుగుబాటుదారుల జీవితాలను చిత్రిస్తాయి. ఆయన పాత్రలు జీవిత ప్రయోజనం గురించి వాదిస్తున్నట్టుగా కనిపించి, అందుకు సమాధానా లిస్తుంటాయి.

తన కథలలోనూ, నవలలలోనూ ఘటనలను వున్నవి వున్నట్టుగా, ఛాయా చిత్రంలాగా చిత్రించడం గోర్కీ పద్ధతి కాదు. అది వాస్తవికతను చంపుతుందని గోర్కీ భావం. జీవితంలో ఆసక్తిని కల్పించి, విసుగుదలను పోగొట్టి, జీవితంలోని అందచందాల పట్ల, మంచిపట్ల ఆకర్షణను కల్పించి, పాఠకులను కార్యాసక్తుల్ని చేయడం ఆయన పద్ధతి. 'డేగ పాట'వంటి కథలు, గీతాలలో ఇదిద్యోతకమవుతుంది

ఈ విప్లవ కాల్పనికతకు మచ్చుతునక గోర్కీ 1902లో వ్రాసిన "అగాథాలు" నాటకం ప్రపంచంలోని పెద్ద నగరాలన్నిట్లో ఇది ప్రదర్శింపబడింది. ప్రభుత్వ వ్యవస్థను కూలదొయ్యమని దీనిలోని పాత్రలేవీ హెచ్చరించనప్పటికీ, జారు ప్రభుత్వపు సెన్సార్లు యీ నాటక ప్రదర్శనకు అనేక ఆటంకాలు కల్పించారు. దీనిలోని ముఖ్య పాత్రలు దొంగలు, వ్యభిచారిణులు-యిటువంటి వారే. ఈ సమాజం ఇలా సాగరాదని వీళ్లంతా ఎలుగెత్తి చాటుతున్నట్టుగా ఈ నాటకం ధ్వనిస్తుంది. పరిస్థితులకు లొంగిపోయి బ్రతుకు వెళ్ళబుచ్చుకుందామనే వృద్ధుని పాత్రను తక్కిన పాత్రలు అసహ్యించుకుంటాయి.

సుప్రసిద్ధ నవల "అమ్మ"లోనూ ఇదే భావన గర్భితమైవుంది. ఈ శతాబ్ది ప్రారంభంలోని కార్మికుల జీవితాన్ని, వారి వర్గ పోరాటాన్ని యీ నవల చిత్రించింది. విప్లవ సమరంలో ప్రజలెలా ఆత్మికంగా పెంపొందుతారో గోర్కీ యీ నవలలో చూపారు. సోషలిస్టు వాస్తవికత జీవితం నుండి ఎలా విషయాన్ని సేకరించేదీ చూపించి, యీ నవల విప్లవకారులను విధ్వంసకారులుగా చిత్రించిన పూర్వ సాహిత్యానికి భిన్నమైనది. విప్లవ సమరంలో ప్రవేశించడమంటే ఆత్మికోన్నతిని అందుకోవడమని తెలుపుతుందిది. ప్రజల బాధలనే కాక, వారు సమాజాన్ని మార్చడానికి పాటుపడుతూ తాము ఎలా మారిపోతారో గోర్కీ చిత్రించారు. అక్టోబరు విప్లవానికి పూర్వం, గోర్కీని కలుసుకోవడానికి ముందర లెనిన్ యీ నవలను చదివారు. గోర్కీని తొలిసారిగా కలిసినప్పుడు, లెనిన్ "ఇది సరిగ్గా సమయానికి తగ్గట్లు వచ్చిన పుస్తకం" అనీ, చాలా అవసరమైన పుస్తకమనీ, తమంతట తాముగా విప్లవోద్యమంలో చేరిన అనేకమంది కార్మికులకు "అమ్మ" చాలా ఉపయోగకరంగా వుందనీ అన్నారు.

రష్యాలోని ధనికులు, వర్తకులు, ధనికులతో ముడిపడివున్న మేధావులూ కూడా గోర్కీ రచనలలో కనిపిస్తారు. ("ఎగొర్ బులిచెవ్"లో ఫోమా గోర్డెయెవ్" మొదలైనవి). వారి శక్తి సామర్థ్యాలపట్ల అక్కడక్కడ ఆయన ప్రశంసను కూడా వ్యక్తపర్చక పోలేదు. కాని వారి జీవితం వారికే ఎలా కీడుచేస్తున్నదీ, వారి ఆత్మనెలా నశించి జేసేదీ చూపారు; వారి దోపిడీ జీవితం వారినే కాకుండా, వారి బిడ్డల్ని, బిడ్డల బిడ్డల్ని ఎలా భ్రష్టుల్ని చేస్తున్నదీ చిత్రించారు.

సాహిత్యంలో సోషలిస్టు వాస్తవికత పద్ధతికి స్థాపకుడయిన గోర్కీ, నూతన రష్యన్ సారస్వత పితగా పరిగణింపబడటమే కాక, శ్రామిక విమోచనా భావ ప్రపూరితమైన ప్రపంచ సాహిత్యానికి అద్యుడూ, ఆరాధ్యుడూ అయ్యారు.

వల్లథోల్ నారాయణ మీనన్

(1878 - 1957)

మలయాళ భాషలోని అమర కవులలో వల్లథోల్ నారాయణ మీనన్ ఒకరు. కేరళలోని ఒక మారుమూల గ్రామం చెన్నూరలో పుట్టి సాంప్రదాయపద్ధతిలో సంస్కృత మలయాళ భాషలు అభ్యసించారు. ఆధునిక భావాలు ఎంత మాత్రమూ అంటని చదువది. అందుకు తోడ్పడే ఇంగ్లీషు నేర్చుకోడానికి, ఆయనకు అవకాశం కలగలేదు. పైగా వినికిడి వలన ఏ కొత్త విషయాన్ని గ్రహించే వీలు కలగకుండా పూర్తిగా బధిరత్వం దాపురించింది. ఇటువంటి స్థితిలో ఎవరైనా సాంప్రదాయ కవిగా తనువు చాలించి వుండేవారు. కాని వల్లథోల్ సాంప్రదాయ కవిగా కావ్యరచన ప్రారంభించి, ప్రకృతి వైభవాన్ని వర్ణించిన కవిగా, కాల్పనిక కవిగా, జాతీయ కవిగా తన జీవితకాలంలోని ప్రతి సమస్యనూ అభ్యుదయభావ ప్రపూరితంగా తనకావ్యాలలో ప్రతిస్పందించిన కవిగా మలయాళ సాహిత్యంలో మహోన్నత స్థానాన్ని అలంకరించారు. కవిగానేకాక గద్యరచయితగా, విమర్శకునిగా ఆయన తన భాషను పరిపుష్టం చేశారు. అన్నిటికంటె, ఆదరణలేక నశిస్తూవుండిన ప్రాచీన కేరళ నాట్యశైలి, కథాకళిని సముద్ధరించి దానికి ప్రపంచ ప్రశస్తిని ఆయన ఆర్జించారు. ఇటువంటి మహా పురుషుని శతజయంతి దినోత్సవం, అభ్యుదయ సాహిత్యానికీ, అభ్యుదయ భావుకతకూ పండగగా ఈ ఏడాది జరుగుతుంది.



తన జీవితయాత్రా కాలంలో ప్రతి అభ్యుదయోద్యమాను కమైన ఉత్సాహాన్ని బలపర్చడానికి ఆయన వెనుతియ్యలేదు. వ్యతిరేకుల నుండి ఎదురు వాళ్ళు రాళ్ళు రువ్వినప్పుడు మహా వెనుకడుగు వెయ్యలేదు. ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో సోవియట్ మిత్ర మండలి సభలలో ఆయన పాల్గొనడం ఇష్టంలేక కొందరు ఛాందసవాదులు రాళ్ళు రువ్వినప్పుడు, వల్లథోల్ తన పైని వారు వేసిన ఒక రాతిని తీసి "నేను చేస్తోన్న మంచి పనికి నా మీద విసిరిన పూవుగా దీనిని స్వీకరిస్తున్నాను" అని సభలోని వారికి చెప్పారు.

తాను నమ్మిన భావాలకు కవితారూపం ఇవ్వడమే కాదు, ఆ ఉద్యమా

లలో త్రికరణశుద్ధిగా వల్లథోల్ పాల్గొన్నారు. యుద్ధాన్ని, సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా ద్వేషించిన వల్లథోల్ యుద్ధ ద్వేషి. సామ్రాజ్యవాద వ్యతిరేకి అయిన సోవియట్ దేశాన్ని గాఢంగా ప్రేమించారు. ప్రపంచ శాంతి ఉద్యమంలో పాల్గొంటూ, ఆయన వృద్ధాప్యంలో వార్సాలో జరిగిన శాంతి మహాసభకు వెళ్లి ఉపన్యసించారు. స్వదేశానికి తిరిగివచ్చాక శాంతిని గురించి అనేకగీతాలు వ్రాశారు. "హృదయంలేని సామ్రాజ్యవాద యుద్ధోన్మాదులు, తిండికోసం చేయిచాచిన ఆకలితోవున్న పిల్లల చేతులలో తుపాకీగుళ్లు పెడుతున్నారు" అని ఆయన వ్రాశారు.

సోవియట్ దేశంపైన హిట్లర్ దాడి జరిగినప్పుడు, ఆ దేశ భద్రతను గురించి ఆయన ఎంతో ఆందోళన చెందారు. టాల్‌స్టాయ్ గ్రామం యాస్నయా పోల్యానా పైన హిట్లర్ విమానాలు బాంబులు కురిపించినప్పుడు, తన అసమ్మతిని వ్యక్తం చేస్తూ ఆయన పద్యాలు వ్రాశారు. 1951 లో సోవియట్ దేశం వెళ్ళి, సోషలిజం సాధిస్తున్న విజయాలను ప్రశంసిస్తూ "రష్యాలో" అన్న పద్యకావ్యం రచించారు.

"ఎత్తయిన వేదిక మీద
విశాల హృదయుడు లెనిన్,
తెల్లని ఆయన శరీరం
విద్యుద్దీప కాంతులతో మెరుస్తోంది,
రష్యాలోని చీకటిని పారదోలిన
శుభ్ర ప్రభాత మూర్తిలాగా
—అందరినీ మేల్కొల్పే మూర్తీభ
వించిన ప్రభాతంలాగా"

అన్నది లెనిన్ మూర్తిని దర్శించి రాసిన కవిత.

అన్నిటికంటె ప్రధానంగా వల్లథోల్ జాతీయతా భావాలు వెల్లి విరిసిన కేరళ మహాకవి, మానవతావాది, అంతర్జాతీయతావాది. భూస్వాముల పీడననుండి రైతుకు విముక్తి చేయవలసిన అవసరాన్ని గుర్తు చేసిన, కార్మికుల రక్తాన్ని పిండే పెట్టుబడిదారులను నిరసించిన తొలి కేరళ మహాకవి ఆయన.

"పెట్టుబడిదారుకు స్వర్గాన్ని సృష్టించిన వారు ఆకలిలో అలమటిస్తూ మరణిస్తున్నారు. తన యజమానికి మొఖమల్ పరుపులు కుట్టినవాళ్ళు బంధితులై, స్తంభించి పనికిమాలిన కర్రచెక్కమీద పరుండి ప్రాణాలు విడుస్తున్నారు"

కార్మికోద్యమ మన్నది లేని 1926 సం.లో వ్రాసిన గీతం యిది.

భారత స్వాతంత్ర్యోద్యమ శైశవ దశలో వల్లథోల్ ఆకాంక్ష.

"తన నైతిక హస్తాలకు బానిసబంధాలను కేరళ ఛేదించుకోవడం, ప్రపంచాన్ని శిక్షించడానికి కాదు, బాధతో గిజగిజలాడుతున్న వారిని మృదువుగా తట్టి ఉపశమింపచేయడానికి

బృహత్స్వర భృతకుంజరం తనకు కట్టివేసిన గొలుసుల్ని తెంచుకోవడం పిచ్చెక్కి పరిగెత్తుతూ, తన బరువైన కాళ్ళతో లోకాన్ని కుమ్మివెయ్యడానికి కాదు, బందీయై, గోతిలో నిస్సహాయంగా కొట్టుమిట్టాడుతున్న వారిని తనబలమైన తొండాన్ని ఆసరాయిచ్చి, పైకి లేవనెత్తడానికి.

సాహిత్య అకాదెమీ ఆధ్వర్యాన ఏకాంక నాటికపై వర్క్‌షాప్

[మా విలేఖరి]

కేంద్ర సాహిత్య ఎకాడెమీ దక్షిణ ప్రాంతీయ కార్యాలయం ఫిబ్రవరి 25 వ తేదీ మొదలు మార్చి 3 వరకూ మద్రాసులో ఏకాంకికపై వర్క్‌షాప్‌ను నిర్వహించింది. దక్షిణ భారత భాషలు తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషల నుంచి ప్రత్యేకాహ్వానితులైన పదిహేనుమంది విఖ్యాత నాటక, నాటికా రచయితలు గోష్ఠిలో పాల్గొన్నారు.

రేడియో నాటకం, ఏకాంక నాటికల మధ్యనున్న సమానత్వం, అంతరం, మలయాళ భాషా నాటకములమీద మార్క్సిజం ప్రభావం; నాటక రచయితకూ, దర్శకునికీ ఎల్లప్పుడూ వుండే సంఘర్షణ, నటుని పాత్ర మొదలైన విషయాల మీద గోష్ఠి సాగింది. ఈ చర్చల ఫలితంగా రేడియో నాటిక సమగ్ర వికాసం పొందలేదని, అబ్సర్డు నాటకం కన్నడంలో బాగా వృద్ధి పొందినదని, నాటకంలోని దృశ్యతావకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదని చర్చలు తెలిపాయి.

ప్రతిరోజూ గోష్ఠుల అనంతరం ఉపన్యాసాలు ఏర్పాటు చేయబడినాయి. తరవాత జరిగిన చర్చలలో స్థానిక రచయితలు కూడా పాల్గొన్నారు.

వర్క్‌షాప్ జరుగుతున్న కాలంలో రెండు ఏకాంక నాటికలు– "అడవి" (తెలుగు), "ఒరుకొలై" (ఒక హత్య–తమిళం) ప్రదర్శించబడినాయి. తమిళ నాటక ప్రదర్శనలో వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నవారు కూడా పాత్రలు ధరించి నటించారు (పూర్ణం విశ్వనాథం, కూత పిరాన్).

ప్రొఫెసర్ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్ ప్రారంభోపన్యాసం చేశారు. నాటకం అన్నది ప్రదర్శనకు ఉద్దేశించబడింది కనుక సాహిత్య, సంగీత–నాటక అకాడెమీలు సంయుక్తంగా ఇటువంటి వర్క్‌షాప్‌లను నిర్వహించడం ఎక్కువ ప్రయోజనకరంగా వుంటుందన్నారు. 1912లో హార్వర్డు యూనివర్శిటీలో ప్రొఫెసర్ జి. పి. బాకెర్ నిర్వహించిన "47 వర్క్‌షాప్"లో నూతన నాటకాలను వ్రాయించి, జాగ్రత్తగా ఒద్దికలు వేయించి ప్రదర్శించడం చేయడం వలన ఎటువంటి సత్ఫలితాలు కలిగాయో వివరించారు. తరవాత నాటకం, నాటికల మధ్య భేదాన్ని వివరిస్తూ నాటకంలో సంఘర్షణ, పరిష్కారాల చిత్రీకరణలో విధిగా కాలవ్యవధి, పరిణామాలు చూపగలుగుతారనీ, నాటికలో ఆ క్షణాన్ని తీసుకొని నిశితంగా

కేంద్రీకరించవలసి వుంటుంది గనక ఎన్నుకొనే కాలాన్ని చాలా జాగ్రత్తగా చూసుకోవడం, దానిని పూర్తిగా ఉపయోగించుకోవడం అవసరం అని అన్నారు.

వర్క్‌షాప్‌కు అధ్యక్షత వహించిన డా॥ పి.వి రాజమన్నార్ నాటిక రచనలోనూ, ప్రదర్శనలోనూ తమ అనుభవాలను వివరిస్తూ, సాహిత్య అకాడెమీ ఏకాంకిల గురించి వర్క్‌షాప్ నిర్వహించడాన్ని ప్రస్తుతించేరు. ఏకాంకిక, నాటకముల మధ్య అంతరాన్ని గుర్తుచేస్తూ నాటకాన్ని సంగ్రహం చేస్తే నాటిక అవదన్నారు. అయితే పెద్ద నాటకం దేనినైనా సర్దుబాట్లు చేసుకొని ఏకాంకికగా మార్చుకోవడం సాధ్యమే నన్నారు, రేడియో ప్రసారాలు ఏకాంకికల విస్తృతికి తోడ్పడ్డాయన్నారు. అయితే రేడియో నాటకం, మామూలు ఏకాంకిక భిన్నం, రేడియో నాటిక కేవలం వినేది మాత్రం, దానిలో దృశ్యత్వానికి బదులు శ్రోతల ఊహాశక్తి అవసరం, అందుచేత రేడియో నాటిక శిల్పమే వేరన్నారు.

ప్రాచీన సంస్కృత సాహిత్యంలోని భాణము, వ్యాయోగము, ప్రహసనము, వీధి మొదలగు వాటికి ఏకాంకికలకూ గల పోలికలనూ, భేదాలనూ చూపుతూ వర్తమానకాలపు ఏకాంకిక పూర్తిగా నవ్యప్రక్రియ అన్నారు.

26 వ తేదీ చర్చల అనంతరం జరిగిన గోష్ఠిలో శ్రీ విశ్వనాధ పైరే "నాటకంలో అలౌకికాంశాన్ని ప్రవేశపెట్టిన తీరు" గురించి ప్రసంగించేరు.

27 వ తేదీన ప్రొఫెసర్ జి. శంకర పిళ్ళె మళయాళంలో ఏకాంకికలను గురించి ప్రసంగించేరు. "తమిళ నాటకరంగం స్వీకరించిన పాశ్చాత్య పద్ధతుల ననుకరిస్తూ కేరళలో నాటక ప్రదర్శనలు ప్రారంభమయాయి. సంస్కృత నాటకాల ననువదించి, ప్రదర్శించినా, అవి నాట్యశాస్త్రం విధించిన పద్ధతులలోగాక తమిళ సమాజాలు ప్రవేశపెట్టిన పార్సీ పక్కీలోనే జరిగేవి. విద్యావంతుల పాశ్చాత్య నాటకాల పరిచయం సాహిత్యపరంగానే సాగింది గాని ప్రదర్శనపరంగా నడవలేదు. ఫలితంగా పాశ్చాత్య అనువాదాలూ, స్వతంత్ర నాటకాలూ ఎన్నో మళయాళంలో వచ్చినా వాని సాహిత్య ప్రాముఖ్యాన్నేగాని, ప్రదర్శనోచితను ఎవరూ పట్టించుకోలేదు. రంగంమీద కాళ్ళూ చేతులూ తిప్పడం, గంతులెయ్యడం, మధ్య మధ్య హాస్యం చొప్పించడంగానే నాటక ప్రదర్శన లుండిపోయాయి. ఏకాంకికల్ని పోలిన దేశీయ రూపకాలు కొన్నివున్నా ఏకాంకిక నూటికి నూరుపాళ్ళూ పాశ్చాత్యం" అని చెప్పి, తరవాత పత్రికలు చిన్న కథకూ, చిన్న నాటకానికీ చేసిన దోహదాన్ని పేర్కొని అంకము, రంగము అనే సంకేతాల ప్రయోజనాన్ని వివరించేరు. నాటకంలోనేగాక నాటికతోకూడ ఏకాంకిక భేదిస్తుందని ప్రదర్శన కాలవ్యవధి ఒక్కటే ఈ భేదాలకు మూలం కాదని అన్నారు. కథావస్తువులోని నాటకీయతను గురించి రచయితకు గల అవగాహన నాటకాన్నో, నాటికనో, ఏకాంకికనో వ్రాయిస్తుందన్నారు. వర్తమానకాలంలో ప్రేక్షకులు 30–40 నిమిషాల నాటకం చూడ్డంమీద కన్న 2–3 గంటల నాటకాలు చూడ్డానికి అలవాటు పడటమూ, అభిమానించడమూ

ఏకాంకికల ప్రదర్శనలకు పెద్ద ఆటంకం కాబట్టి అవి సాహిత్య ప్రధానంగానే వుండి పోయేయన్నారు.

"ఈ పరిస్థితులున్నా ఇబ్సెన్ ప్రభావంతో కొంతమంది మంచి ఏకాంకికలు వ్రాశారు. వీరి నాటికలు కాలేజీ క్లబ్బులలో, స్కూలు సాంవత్సరికోత్సవాలలో ప్రదర్శించబడినాయి. ఆ క్రమంలో ఎందరో కొత్త నాటక రచయితలు బయలు దేరేరు. ఫలితంగా ఏకాంకిక ప్రదర్శనలు పరిపాటి అయ్యాయి.

"60 వ దశాబ్ది ప్రాంతాలకు ఏకాంకిక బాగా ప్రాచుర్యం పొందింది. ఓనీల్, పిరాండెల్లో, బ్రెహ్ట్, బెకెట్ మొదలయిన ప్రముఖ నాటక రచయితల ప్రభావంతో అనేకమంది నూతన రచయితలు ఈ ప్రక్రియను అధిక ఫలప్రదంగా వుపయోగించ సాగేరు. ఓమ్చెరీ, ఎన్. ఎన్. పిళ్ళై, తోప్పిల్ భాసీ మొదలైనవారు మంచి ఏకాంకికలు వ్రాసేరు.

"ఏకాంకికల రచన విస్తరించడంతో ఔత్సాహిక నాటక బృందాలు అన్ని చోట్లా ఏర్పడ్డాయి. ప్రదర్శనల పోటీలు పెరిగేయి. ఏకాంకికలను పరిశీలించి ప్రదర్శించేందుకు శిబిరాలు నడిచేయి. వీటన్నింటితో నాటక రచయితలు కూడా యీ ప్రక్రియను పెంపొందించడానికై విశేషశ్రద్ధ తీసుకోసాగేరు. ఈ అభివృద్ధి క్రమం ఇప్పుడే పూవు అందుకొంది. ఫలితాలు ఎలా వుంటాయో చూడాలి'' అన్నారు.

28 వ తేదీన ధార్వార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శ్రీ చంద్రశేఖర పాటిల్ కన్నడంలో ఏకాంకిక, ముఖ్యంగా 'అబ్సర్డ్' నాటికల అభివృద్ధి గురించి ప్రసంగించారు. మార్చి 1 వ తేదీన "తెలుగులో ఏకాంకిక"పై శ్రీ పాలగుమ్మి పద్మరాజు ప్రసంగించారు (ఈ ప్రసంగాన్ని యీ సంచికలోనే వేరుగా ప్రచురిస్తున్నాము)

మార్చి 2 వ తేదీన "తమిళంలో ఏకాంకిక'' గురించి శ్రీ గోమతి స్వామినాదన్ ప్రసంగించారు. వీరు తమిళంలో హాస్యప్రధానంగా నాటకాలు, నాటికలు మొత్తం 700 వరకూ వ్రాశారు. వీరు తమ ప్రసంగంలో మహారాష్ట్ర నాటక దళాల ప్రభావంతో తమిళంలో నాటకరంగం ఎలా అభివృద్ధి చెందిందో వివరించేరు. తాము నాటక వస్తువును సేకరించేందుకై బస్సులలో, రైళ్ళలో మరో పనిలేనట్లు. ప్రత్యేకంగా ఇందుకే ప్రయాణం చేస్తుంటామని, ప్రయాణీకుల మాటలలో నిత్యజీవిత కథావస్తువు పుష్కలంగా లభిస్తుందనీ అన్నారు. ఆ కథావస్తువుకు నాటకీయత కల్పించేందుకై చేసే చిన్న చిన్న మార్పులను, వాటి ఫలితాలను చాల ఆసక్తిదాయకంగా వివరించేరు.

3 వ తేదీన సుప్రసిద్ధ సంస్కృత విద్వాంసులు శ్రీ వి. రాఘవన్ ముగింపు ప్రసంగం చేసేరు. ఆయన అధ్యక్షతన జరిగిన సభలో సుప్రసిద్ధ మలయాళ నాటక రచయిత శ్రీ తోప్పిల్ భాసీ ప్రసంగించారు.

"సహృదయులలో భావోద్దీప్తి కలిగించేది రసం. ఆ ఉద్దీప్తిని కలిగించలేనిది

ఏదీ కళ కాజాలదు. కవితకానీ, కథగానీ కళాత్మకంగా వున్నదంటే దానిలో నాటక లక్షణాలు వున్నాయనే చెప్పవచ్చు''

"మొన్న శ్రీ యస్.కె. నాయర్ ప్రసంగిస్తూ "నన్ను కమ్యూనిస్టును చేసింది నువ్వే'' అన్నా నా నాటకం కేరళలో రాజకీయ విప్లవం తెచ్చిందన్నారు. అది నిజం. కేరళ ప్రజల్ని కమ్యూనిస్టు భావప్రేరితుల్ని చేసినా, చేయకపోయినా తమ జీవిత పరిస్థితుల దుర్భరత్వాన్ని గమనించేటట్లు చేసిందా నాటకం. ఆ విధంగా వారు రాజకీయ చైతన్యం పొందేరు. ఆ సంభాషణలు, ఘటనలు ప్రజల్ని ఆలోచింపచేశాయని సగర్వంగా చెప్పగలను. ఆలోచనలోపడ్డ మనిషిని మార్చడం సులభమే.

"ఎంత ప్రతిభావంతుడైనా రచయిత అలంకార శాస్త్ర గ్రంథాలను అక్షరశః పాటిస్తూ మంచి రచన చేయలేడు. తమ చుట్టూవున్న జీవితం అతని కలాన్ని నడిపించాలి. ప్రేక్షకులను వినోదించి ప్రయోజనంలేదు వారిలో భావస్పందన కలిగించలేకపోవడం రచయిత లోపం, అసమర్థతా. నా నాటకాన్ని లక్షలాది ప్రజ, అన్ని తరగతులవారూ చూశారు. ప్రభావితులయారు. నేను సంస్కృత అలంకార శాస్త్రాన్ని గుణంగా వ్రాసివుండలేదు. పాశ్చాత్య నాటకాల పక్కీనీ అనుసరించలేదు. నా బాణీ నాది. ప్రజల భావాల్ని పరిశీలించా. వారి జీవితాన్ని చిత్రించా. నా నాటకం ప్రజల మనస్సుల్ని ఆకట్టుకుంది.

"ఏకాంకికలో, నాటకాలో వ్రాయదలచిన వారికి నా సలహా ఒక్కటే. నాట్య శాస్త్ర సూత్రాలూ, శిల్పాలూ గురించి బాధపడకండి. తాము వ్రాసినది పెద్దదో, చిన్నదో ప్రజలలో భావోద్దీపనం కలిగించాలి. అదే దాని కళాత్మకతకు చిహ్నం', అన్నారు.

క్రాంతి కవిత

—పి. పద్మజవాణి

మళ్ళీ కొత్త సంవత్సరం
మళ్ళీ ఓ వుగాది పాట ....
పింగళుపు పాడలేక
తంత్రులు త్రెంచేసిన
జీవన విపంచి
విషాద రాగం
వుండుండి మ్రోగుతూంది.
నేల కూలిన మావిలో
లేత చివుళ్ళు లేవు
కోయిలమ్మలూ లేవు —
సర్వం కోల్పోయిన
నిర్వాసితులు ఎదల్లో
ఓ కాళయుక్తీ .... నీ
దయాపారవశాలు

ఎగురు వేయాలి రమ్మా ....
అనాథల్ని దోచుకుతినే
వంచకులని పట్టి .... నీ
సహస్ర ఫణి రజిత శిరమెత్తి
పరశురాముడివై
పరిమార్చాలి సుమ్మా ....
మోడు వారిన తెలుగు నేలకి
వెలుగుల మాల వేస్తావని
ఆశిస్తూ
స్వాగతం చెప్తున్నాను
ఈ వుగాది నాడు నీ కోసం
విక్రాంతి గీతం
ఆలపిస్తున్నాను

కళ గురించి లెనిన్

ముఖ్యమైనది కళ గురించి మన అభిప్రాయం కాదు. లక్షోపలక్షల మందిగా జనాభా వున్నప్పుడు కొద్ది వందల మందికి, లేదా కొద్ది వేలమందికైనా సరే కళ పట్ల కల ఒక దృక్పథం వల్ల కూడా పెద్దగా ఫలితం వుండదు. కళ ప్రజలకు చెందినది. దాని వేళ్లు శ్రామిక ప్రజాసమూహాలలో లోతుగా పాతుకపోయి వుండాలి. ప్రజా సమూహాలకది అవగాహనవ్వాలి, దానిని వారు అభిమానించాలి. వారి భావాలను, ఆలోచనలను, సంకల్పాన్ని అది ఐక్యం చెయ్యాలి. ఉన్నత స్థితికి తీసుక వెళ్లాలి. వారిలోని కళాభిరుచులకు అది క్రియాశీలమైన ప్రేరణకావాలి. వాటి నది పెంపొందించాలి. కార్మిక కర్షక ప్రజలకు నల్లరొట్టె లేనప్పుడు కొద్ది మందికి మనం కమ్మని కేకు వడ్డించాలా? ఈ తరవాత చెప్పబోయేదానిని అక్షరస్యానే కాకుండా అలంకారికంగా కూడా అర్థం చేసుకోవాలని చెప్పనక్కరలేదు: మనం ఎల్లప్పుడూ కార్మిక కర్షకులను దృష్టిలో పెట్టుకోవాలి ....యిది కళా, సంస్కృతీ రంగానికి కూడా వర్తిస్తుంది.



ప్రజలకు కళ సన్నిహితం అయ్యేందుకు, ప్రజలు కళకు సన్నిహితులయ్యేందుకు సాధారణ విద్యా సాంస్కృతిక ప్రమాణాలను పెంచడం మనం మొదలు పెట్టాలి.

* * *

ఊరకనే వుంటూ, అరాచకం స్వేచ్ఛగా పెరగడానికి వీలుకలిగించకూడదు.... అందమైన దానిని భద్రపరచాలి. అది 'పాత'దైనా సరే దాన్ని ఉదాహరణగా తీసుకోవాలి. 'కొత్త'దైనంత మాత్రంచేత కొత్తదానిని విధేయతతో దేవుణ్ణి ఆరాధించినట్టు ఎందుకు ఆరాధించాలి? అవివేకం, ఉత్త అవివేకం! దీనిలో కేవలం దగా చాలా వుంది; పశ్చిమ దేశాలలో పెత్తనం చేస్తోన్న కళకు సంబంధించిన మోజుపట్ల తెలియని గౌరవం కూడా వుందనుకొంటి. మనం మంచి విప్లవకారులమే కాని, 'ఆధునిక సంస్కృతిలోనూ వెనకబడలేద'ని నిరూపించుకునేందుకోసం ఎంతో కొంత మనం తంటాలు పడతాం.... ఎక్స్‌ప్రెషనిజం, ఫ్యూచరిజం, క్యూబిజం తదితర 'యిజాల' ఫలితాలు కళాత్మక ఉపజ్ఞకు పరాకాష్ఠలని నేను భావించలేను. నాకవి అర్థంకావు. నాకవి ఎంత మాత్రం ఆనందాన్నివ్వవు.

(అంతర్జాతీయ కార్మికోద్యమ నాయకురాలు క్లారా జెట్కిన్‌తో సంభాషణలో)

బ్రౌన్ వ్యక్తిత్వం

వి. చెంచయ్య

భారత దేశాన్ని ఆంగ్లేయులు పాలిస్తున్న కాలంలో కీలకమైన ఉద్యోగాల్ని చేపట్టిన ఆంగ్లేయుల్లో మానవత్వపు విలువలు తెలిసిన కొద్దిమందిలో సి. పి. బ్రౌన్ ఒకడు. ఉద్యోగార్థం వచ్చి ఉద్యోగ బాధ్యతతో బాటు, తెలుగు సాహిత్యోద్ధరణ బాధ్యతను కూడా పైన వేసుకొని, దాన్ని సక్రమంగా నిర్వర్తించి, చాలావరకు తృప్తితో వెళ్ళిపోయినవాడు బ్రౌన్. 19వ శతాబ్దంలో దాదాపు మూడున్నర దశాబ్దాలపాటు తెలుగు దేశంలో వుండి, తెలుగుజాతి జీవనాడిని, సంస్కృతిని యెక్స్‌రే తీసినవాడు బ్రౌన్. పట్టుదల, పరిశ్రమ, మేధ— యీ మూడు సమపాళ్ళలో వున్న వ్యక్తి బ్రౌన్.

కావ్యాలకు, నిఘంటువులకు సంబంధించిన బ్రౌన్ ప్రాతప్రతుల్ని తిరగేస్తుంటే బ్రౌన్ స్వరూపం విశ్వరూపంగా సాక్షాత్కరిస్తుంది. బ్రౌన్ రూపం యెలా వుండేదో యింతవరకు మనకు తెలియకపోయినా ఆయన మనస్సు, హృదయం, వ్యక్తిత్వం యెలాంటివో ఆయన రచనల ద్వారా బాగా తెలుసుకోవచ్చు. కావ్యాల్ని పరిష్కరిస్తున్నప్పుడూ, నిఘంటువుల్ని తయారు చేస్తున్నప్పుడూ, వాటికి సంబంధించిన యితర వివరాలూ, వివరణలూ రాసుకుంటున్నప్పుడూ బ్రౌన్ ప్రత్యేకత కనిపిస్తుంది. ఆ ప్రత్యేకతలోనే ఆయన వ్యక్తిత్వం ప్రస్ఫుటమౌతుంది.

బాల్యంలోనే బ్రౌన్ సాహిత్యాభిరుచిని చవి చూశాడు. మిల్టన్, డ్రైడన్, కూపర్, వాల్టర్ స్కాట్‌ల రచనలు చదివి కొన్ని అభిప్రాయాల్ని యేర్పరుచుకున్నాడు, అనుభూతుల్ని పదిలపరుచుకున్నాడు. అప్పుడప్పుడూ కవిత్వం కూడా రాసేవాడు. కాని తనకే నచ్చకపోయింది రాసినట్టు తగలబెట్టేవాడు. వొక్క కవితా ఖండిక మాత్రం ఎలాగో తప్పించుకుని బ్రతికి బయట పడింది.

అడుగడుగునా మన దేశంలో అవిద్య నాట్యం చేస్తున్న ఆ రోజుల్లో, బ్రౌన్‌కు చదువు సంధ్యలున్న యువకులే కనిపించకపోవటం ఒకపక్క ఆశ్చర్యాన్నీ, మరో పక్క ఆవేదననీ కలిగించింది. అంతే, కడపలో రెండు పాఠశాలల్ని పెట్టి ఉచితంగా చదువు చెప్పించాడు. ఉపాధ్యాయులక్కూడా తనజేబులోంచే జీతాలిచ్చాడు. మచిలీపట్నంలో రెండూ, మద్రాసులో ఒకటీ ఉచిత విద్యాసంస్థల్ని నడిపాడు. అందుకే తెలుగువాళ్ళకు తెలుగు నేర్పించిన తొలి పాశ్చాత్యుడు బ్రౌన్ అనడంలో అతిశయోక్తి లేదు.

ఆర్థికంగా యెన్ని యిబ్బందుల్లో వున్నా దాన ధర్మాలు చెయ్యటం మానేవాడు కాదు బ్రౌన్. ఒక దశలో నెలకు అయిదువందల రూపాయలు దాన ధర్మాలకే ఖర్చవుతుండేదట! యెంతో మంది బ్రౌన్‌కు రాసిన లేఖలు బ్రౌన్ దాన తత్పరతకు తార్కాణాలు. ఉద్యోగిగావుండి వేలాది రూపాయలు తెలుగు,

'తెలుగు నిఘంటు శాస్త్రం— సి. పి. బ్రౌన్ కృషి' అన్న విషయంపైన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పి. హెచ్. డి. పట్టానికి పరిశోధక విద్యార్థి.

సంస్కృత సాహిత్య లిఖిత పత్రాల్ని సంపాదించడానికీ, తయారు చేయించడానికీ ఖర్చుపెట్టిన బ్రౌన్, పుష్కలంగా దానధర్మాలు కూడా చెయ్యగలిగాడంటే అతని జాలిగుండె తప్ప మరేమి కారణం కాదు.

ఉద్యోగ నిర్వహణలో బ్రౌన్‌కున్న చిత్తశుద్ధిని తెలుసుకోడానికి ఒక చిన్న ఉదాహరణ. బ్రౌన్ గుంటూరు కలక్టరుగా వున్నప్పుడు అక్కడ సంభవించిన కరువును గురించి పై అధికారికి రిపోర్టు పంపితే, కొన్ని వస్తువులకు కొరత వున్నంత మాత్రాన్నే దాన్ని 'కరువు' అని అంత పెద్ద పేరు పెడతావా అంటూ పైనుండి దండింపు వచ్చినప్పుడు, వస్తువుల ధరలన్నీ— కరువుకు ముందూ, కరువు సమయంలోనూ వున్న రెండు ధరల్నీ— వివరంగా పంపి వెంటనే సహాయ కార్యక్రమాల్ని చేబట్టాలని నివేదించి, మానవత్వాన్ని ప్రదర్శించి, బాధ్యతాయుతంగా ప్రవర్తించాడే తప్ప 'నాకెందుకొచ్చిన కర్మ' అని వూరుకోలేదు.

బ్రౌన్ వ్యక్తిత్వం నుండి విడదీయరాని మరో లక్షణం, పట్టుదల. కడప కలక్టరుకు బ్రౌన్ అసిస్టెంటుగా నియమింపబడ్డాక, ఆ కలక్టర్ తెలుగు ధారాళంగా మాట్లాడడం చూసి చిత్తరవోయిన బ్రౌన్, కొద్దికాలంలోనే ఆ కలక్టరే విస్తుపోయేట్టు మాట్లాడ గలిగాడు. జీవద్భాషను నేర్చుకోడానికి పుస్తకాలొక్కటే చాలవన్న పరమ సత్యాన్ని గుర్తించిన బ్రౌన్ పండితుల్నే గాక తన జీవితంలో ఎదురైన ప్రతి సామాన్యుణ్ని భాషా విషయంలో తను గురువుగానే భావించాడు. ఇది ఆయన పట్టుదలకూ, పెద్ద మనసుకూ చిహ్నం. తెలుగు భాషను ఇలా అధ్యయనం చేశాడు కాబట్టే తెలుగు నుడికారం వ్యక్తమయ్యేట్టుగా నిఘంటు నిర్మాణం చెయ్యగలిగాడు.

ముఖ్యంగా బ్రౌన్ నిఘంటువుల్లో ఆయన వ్యక్తిత్వం చాలావరకు తెలుస్తుంది. నిఘంటువులంటే పదాలకు అర్థాలు రాసుకోవడమే గదా. అందులో వ్యక్తి వ్యక్తిత్వం అంటూ ప్రత్యేకంగా ఎలా వుంటుంది అని సందేహం రావచ్చు. బ్రౌన్ నిఘంటువుల్లో యీ విశేషాన్ని గుర్తించాలి. తన నిఘంటువుల వ్రాత ప్రతుల్లో ఒకచోట 'యోగము' అనే పదాన్ని గురించి అనేక విషయాల్ని సేకరించి రాసి పెట్టుకుని, దాని పక్కనే 'ఈ విషయాలన్నీ మనం నమ్మనక్కర లేదు' అని కూడా తన వ్యాఖ్యానం రాసుకున్నాడు 'సాముద్రికం' అనే మాటను 'దేహములో ఉండే మచ్చలు, చేతి రేఖలు చూచి అదృష్టమును చెప్పే శాస్త్రం' అని అర్థమిచ్చాడు తన ముద్రిత నిఘంటువులో. అముద్రిత నిఘంటువుల మాన్యువల్లు. చేర్పులు చేసిన వ్రాతప్రతిలో యీ అర్థాన్నే 'దేహములో వుండే మచ్చలు, చేతి రేఖలు చూచి అదృష్టమును చెప్పే పనికి మాలిన దొంగ శాస్త్రం' అని సవరించి, స్వీయాభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

తెలుగు-ఇంగ్లీషు నిఘంటు నిర్మాణం దాదాపు పూర్తయ్యాక వ్రాత ప్రతిలోనే ఒకచోట ఈ నిఘంటుగల మనిషికి అమరకోశము అక్కరలేదు అని రాసుకున్నాడు దీన్ని అహంకారం అనుకోవాలో, ఆత్మ విశ్వాసం అనుకోవాలో ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. కాని ఆ మాట

రాసి అంతటితో వూరుకోలేదు. అలా అనడం బాగా లేదనుకున్నాడేమో దాని పక్కనే, 'No, this is bad' అని మళ్ళా రాసుకున్నాడు. ఒక విధంగా యిదంతా బ్రౌన్ లౌడ్ థింకింగ్(Loud Thinking). యీ ఆలోచనా స్రవంతి లోనే ఆయన వ్యక్తిత్వం లోని విశిష్టత వ్యక్తమవుతుంది.

బ్రౌన్ చాలాసార్లు అనారోగ్యంపాల య్యాడు అంతేగాకుండా ఒక సారిగుర్రం మీది నుంచి పడి తొంటి యెముకతోబాటు కుడిచేతి బొటన వేలు కూడా విరగ్గొట్టు కున్నాడు. కుడిచేతి బొటనవేలు దెబ్బ తింటే రాత కోతలకు యిబ్బందని యెడమ చేత్తో రాయడం అలవాటు చేసు కున్నాడే గాని రాయడం మాత్రం మాను కోలేదు.

యే విషయాన్నయినా హేతుబద్ధంగా ఆలోచించి, దాని లోతుపాతుల్ని తరచి చూడండే నిద్ర పట్టని తత్వం బ్రౌన్‌ది. క్షణకాలాన్ని కూడా వ్యర్థం చెయ్యకుండా, ప్రతి పైసానూ నిస్వార్థంగా సద్విని యోగం చేసిన అచర్య ప్రాయమయిన జీవితం ఆయనది. తనలోవున్నలోపాల్ని తను గుర్తించిన మేరకు నిస్సంకోచంగా సరిదిద్దుకో గలిగిన గొప్ప మనసు.తనకు తెలియనివిషయాన్ని తనకంటే తక్కువ వారు చెప్పినా సంతోషంగాస్వీకరించగల విశాల హృదయం. అవివాహితుడుగా వుండి అహోరాత్రాలు తన ధ్యేయం కోసం కృషి చెయ్యగల పట్టుదల, ఒక పక్క బ్రిటిష్ వాళ్ళు భారత దేశాన్ని పీడిస్తున్నా ఆ పీడనలో భాగం పంచు కోక, భారతీయుల పట్ల తనకవకాశం ఉన్నంత మేరకు ఎంతో జాలినీ, సాను భూతినీ చూపి అన్ని విధాలా సహా యం చెయ్యగలిగిన మానవత్వం బ్రౌన్ విశిష్టత.

"మనిషి"

-కొల్లూరి
సూర్యనారాయణమూర్తి

మనిషికి
అర్థం తెలుసుకుందామని
నిఘంటువులో
ప్రతి పేజీ తిప్పి చూశాను
ప్రయోజనం శూన్యం
నేనూ మనిషినే కనుక
ఒక నిర్ణయానికి వచ్చాను:
కళ్ళుండి మూసుకునేవాడు
చెవులుండి వినలేనివాడు
మనసుండి లేనివాడిగా
మసిలేవాడు మనిషని:

"సామ్యవాదం"

-తిరునగరి

శ్రీ మంతులు వేలు
పేదవారు కోట్లు
ప్లస్ ఇంటూ మైనస్
లేక
మైనస్ ఇంటూ ప్లస్
ఇటీ ఈక్వల్టూ మైనస్
వీరు వారన్నా కావాలి
వారు వీరన్నా కావాలి,
అప్పుడే
ఈక్వేషన్ ఫలితం
ఈక్వల్

తెలుగులో ఏకాంకిక

పొలగుమ్మి పద్మరాజు

సాహిత్య ప్రక్రియగా నాటిక ఆధునిక సాహిత్యం చేసిన సృష్టి ఒక్క సంస్కృతంలో తప్ప మరే ప్రాచీన సాహిత్యంలోనూ ఈ ప్రక్రియ కనబడదు అందులో కూడ మనకి కనిపించేవి భాసుడివే. ఆయన వ్రాసిన 'ఊరుభంగం,' 'దూతవాక్యం,' 'కర్ణభారం' వంటి ఉత్తమ నాటికలు మరే సాహిత్యంలోనూ కనబడవు. అయితే తెలుగులో నాటికలు వ్రాసిన వారెవ్వరూ భాసుని శిల్పాన్నిగాని, కల్పనా పద్ధతినిగాని అనుసరించలేదు. కల్పనలో, వ్యక్తీకరణలో వారు అమెరికన్, యూరపియన్ నాటికలనే అనుసరించేరు. వీరేశలింగంగారు కూడా తమ ప్రహసనాలకు మొలీర్, షెరిడన్‌ల ఒరవడినే అనుసరించేరు. మిగిలిన అనేక సాహిత్య ప్రక్రియలకు లాగే నాటికకు కూడా తెలుగులో ఆయననే ప్రథమ రచయితని నిస్సందేహంగా చెప్పొచ్చు 1888–1897 మధ్య హాస్యసంజీవని పేరుతో ఆయన 50 వరకు నాటికలను వ్రాశారు. ఇంచుమించు వీటన్నిటినీ విద్యార్థుల సాయంతో ప్రదర్శించారు.

వీరేశలింగంగారి ఈ ప్రహసనాలే తెలుగులో వచ్చిన మొదటి నాటికలైనా, తరువాత వచ్చిన నాటికలకు అవి ఒరవడిగా వున్నాయనలేము. వారి సమకాలీనులైన చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహంగార్లు కూడా ఈ మాదిరి ప్రహసనాలు చాలా వ్రాశారు. కాని నాటికా రచనారంగంలో నిజంగా మార్గదర్శిగా డా.రాజమన్నార్‌ను పేర్కొనాలి. ఈయన మొదటి నాటిక ''తప్పెవరిది?'' మొట్టమొదటి మాటు 1930లో ప్రదర్శించబడింది. తరవాత వ్రాసిన 'ఏమి మగవాళ్ళు?' 'దయ్యాల్లంక,' 'నిష్ఫలం' మొదలైన వాటిని అద్వితీయమైన రచనలన వచ్చు. అధునాతన ఆంధ్ర నాటకరచయితలలో శ్రీ రాజమన్నార్‌ను బహుసమర్థునిగా చెప్పితీరాలి.

ఆయన సమకాలీనులే అయిన విశ్వనాథకవిరాజు అనేక ఏకాంకికలు వ్రాశారు. అవి రాజమన్నారు నాటికల కన్నా హెచ్చుగా ప్రదర్శించబడి. విశేష ప్రచారం పొందేయి. అవి హాస్యప్రధానం. రాజమన్నారు నాటికలలో వస్తువు సమాజంలోని అసమానతలు, విలువలు మారిపోతున్న ప్రపంచంలో స్త్రీ పురుషుల మధ్య సంబంధాలూను. విశ్వనాథ కవిరాజుని మానవుల ప్రవర్తనలు, మనస్తత్వాల వైచిత్రిని చిత్రిస్తాయి. ఆయన నాటికలలో 'దొంగాటకం' తరచు ప్రదర్శింపబడింది. కాలేజీ విద్యార్థులు దానిని విశేషంగా అభిమానించేరు. 'దొంకతో షరాబు.' 'కిర్రుగానుగ,' 'వైవాహికం,' 'నాటికినేడు' మొదలైనవి ఆనాడు తమ సున్నితమైన హాస్యంతో ప్రేక్షకుల నలరించేయి. స్త్రీ పురుష సంబంధాలను వస్తు

వుగా తీసుకొన్న 'నాటికి నేడు'లో కూడా ప్రేక్షకులు కన్నీళ్ళు పెట్టరు, నవ్వుకొంటారు, అయ్యో అనుకోరు. ఆప్యాయత అనుభూతి అవుతుంది.

1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు ఏర్పడినాక నాటికా రచన, ప్రదర్శన తెలుగునాట ఊపందుకొంది. విశ్వనాథ కవిరాజు కృషి ఫలితంగా ఏర్పడిన ఈ పరిషత్తు 3 దశాబ్దాలు అవిచ్ఛిన్నంగా నాటక రంగానికి దోహదం చేసింది. తరవాత దానిలో ప్రవేశించిన కూటంబకీయాలూ [?], దేశస్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ ఆధ్వర్యాన ఏర్పడిన అకాడమీలూ ఆంధ్ర నాటక కళా పరిషత్తును నామావశిష్టం చేశాయి.

కీర్తిశేషులైన కొప్పరపు సుబ్బారావు గారు 'లిటిల్ థియేటరు' ఉద్యమాన్ని ప్రారంభించారు, ఆయన మంచి ప్రతిభ గల నాటక రచయిత. నాటక ప్రయోగ పద్ధతులను సులభ తరం చేసేందుకు మార్గాల నన్వేషించడం ఈ ఉద్యమ లక్ష్యం, ఆయనతోనే ఆ ఉద్యమమూ కీర్తిశేషమయింది.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ ప్రయత్నాలకు ప్రజలలో సహకారం సంపాదించే ఉద్దేశంతో, బ్రిటిష్ ప్రభుత్వం మంచినాటకాలకు ధన సహాయం ఇవ్వసాగింది. ఆ ధనాన్ని జేబులో వేసుకొందుకు అనేకమంది వ్యక్తులూ, సంస్థలూ నిజంగా చెదరుపడే ఆవేశాయి [?]. కాని ఈ ధన సహాయం మంచి నాటకాలు రావడానికి తోడ్పడిందని చెప్పలేము.

యుద్ధకాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ కేంద్రాన్ని గుంటూరుకు మార్చినప్పుడు, నాటక రంగానికి విద్యార్థుల నుంచి తోడ్పాటు సంపాదించేందుకు గట్టి కృషి ప్రారంభమయింది. విద్యా సంస్థలు ప్రతిఏటా సాంస్కృతిక వారోత్సవాలు జరపడం ప్రారంభించేయి. ధన సహాయం దండిగా వచ్చింది. సాంకేతిక సహాయం లభించింది. నాటినుంచి తెలుగునాట నాటకారచనా, ప్రదర్శనా బాగా విస్తరించాయి. ఏటా వందల సంఖ్యలో నాటికలు వ్రాయబడడం, ప్రదర్శించడం జరిగాయి. విశ్వవిద్యాలయం మళ్ళీ విశాఖపట్టణానికి మారేక, అందమైన ఆరుబయలు రంగస్థలం నిర్మించబడింది. నాటక కళావిభాగం విశ్వవిద్యాలయంలో ఏర్పరచబడింది. ఈ కృషికంతకూ జీవం ఇచ్చింది, విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు శ్రీ కె. వి. గోపాలస్వామి. ఆయన దూరదృష్టి, సామర్థ్యమూ ఈ ప్రయత్నాన్ని విజయవంతం చేశాయి. రేడియో కూడ ఇప్పుడు [?] నాటకరంగాభివృద్ధికై చాల విశేష శ్రద్ధ తీసుకొంటున్నాయి.

ముప్పదవ దశాబ్దిలోనూ, నలభైవ దశాబ్ది ప్రారంభంలోనూ ప్రజా నాట్యమండలి (పీపుల్స్ థియేటరు) ఉద్యమం తెలుగు దేశంలో నాటకరంగాన్ని బాగా అభివృద్ధిచేసింది. మార్క్సువాద రాజకీయోద్యమం దీనికి వెనక దన్ను. వీరి నాటకాలన్నీ 'నిబద్ధం' అయినా, నవ యుగపు విలువలమీద ధ్యాస మెత్తి ప్రజలలో చైతన్యం కలిగించేయి. ఆత్రేయ, రెంటాల, కొర్రపాటి మొదలైన అనేకమంది రచయితలు తమ నాటకాలూ, నాటికలలో గ్రామీణ ప్రజలలోని మడ్డుతనం వదల్చడానికి తోడుపడ్డారు.

కె. వి. గోపాలస్వామిగారికి తెలుగు నాటికల సంకలనం ఏర్చి కూర్చవలసిం

దిగా పని ఇచ్చేరు. ఆయన, కష్టపడి వ్రాతప్రతులు సేకరించేరు. వాటిని పరిశీలించి, ఎన్నిక చేస్తే పండుగా వున్నాయని చెప్పవగినవి 2 వేలకు పైగా లభించేయి. అసాధారణమైన వస్తువైవిధ్యంగల ఆ సముదాయం నుంచి ఎన్నిక ఎల్లాగ? చివరకు ఏడు నాటికలు మాత్రం తీసి నదరన్ లాంగ్వేజ బుక్ ట్రస్టు వారి ప్రచురణకిచ్చేరు. శ్రీ ముదుకృష్ణ పది నాటకాలను సాహిత్య అకాడెమీ వారి ప్రచురణకు కూర్చి ఇచ్చేరు. అంతక్రితం డా॥ గోపాలకృష్ణమూర్తిగారు రాజమండ్రి సరస్వతీ పవర్ ప్రెస్ వారికోసం రెండు నాటికల సంపుటాలను కూర్చిపెట్టేరు.

1920-30 ల మధ్యకాలంలో ఆంధ్ర దేశంలో సజీవమైన నాటకరంగం వున్నదని చెప్పలేము, కాని ప్రతి రచయితా ఒకటో రెండో నాటకాలో, నాటికలో వ్రాయకుండా వుండలేదు, అటువంటి నాగిలో భమిడిపాటి కామేశ్వరరావుగారి పేరు ప్రథమ గణ్యం. వీరు మొలియర్ ధోరణిలో విచిత్రఘటనలూ, హాస్యమూ మిళితం చేసి అనేక నాటకలు వ్రాశారు.

తెలుగు వాక్యం ఉద్వేగవంతం. కవితా స్ఫూర్తి కలిగి మానవ వైశిష్ట్యాన్ని చిత్రించే రచనల్ని మేం అభిమానిస్తాం, బీదలు, దీనులు, మహిళల బాధల్ని ఎంతో ఉద్వేగంగా చిత్రించిన పాటలు, వేలు నాటికలు, నాటకాలూ మాకున్నాయి. ఎంతో మంది సమర్థులైన రచయితలూ వున్నారు. అందర్నీ పేరు పేరువరసన చెప్పడం అసాధ్యం. ఆత్రేయ, మారుతీరావు, గణేశ పాత్రో వంటివారు ఎందరో ఉన్నారు.

[సాహిత్య అకాడెమి దక్షిణ ప్రాంతీయ కార్యాలయం యువకుల ఏకాంకికల గురించి మద్రాసులో నిర్వహించిన కర్మాగారంలో చదివిన వ్యాసం.]

'వ్రాయడం మహాకష్టమైన పని'

విఖ్యాత అమెరికన్ రచయిత అలవాట్లు, పద్ధతులూ

ఇంగ్లీషు చదువుకొని, ఆ భాషాసాహిత్యం చదవటం అలవాటున్న చాల మందికి ఆర్థర్ హెయిలీ పేరు కొత్త కాదు. ఆయన వ్రాసిన "ఎయిర్ పోర్ట్", "హోటల్", "ఫైనల్ డయాగ్నసిస్ "పిల్స్" మొదలయినవి చాలా ప్రాచుర్యం వున్న నవలలు. ఆయన పుస్తకాలు 38 భాషలలోకి అనువదించబడినాయి.

సువిఖ్యాతుడైన ఈ అమెరికన్ రచయిత తన రచనా పద్ధతిని గురించి ఇచ్చిన వివరణ యిది.

ఈనాటి నవలల్లో ఘటనలకు చాలా ప్రాముఖ్యం వున్నదని నా అభిప్రాయం అలాగే విషయ వివరణ కూడా అందుచేత ఏదన్నా వ్రాయబోయే ముందు ఆ విషయంగురించి ఓ ఏడాదిపాటు పరిశోధన చేస్తా.

నా నవల దేనికైనా మూడేసేళ్ళు పడుతుంది, వ్రాయడానికి. ఫలానా విషయం గురించి రాయాలని నిర్ణయం తీసుకొన్నాక, ఇంకా విషయంమీద పరిశోధన ప్రారంభిస్తా. అందుకోసం దేశ, విదేశాల్లో పర్యటిస్తా. ఎందర్నో కలుసుకుంటా. మేనేజర్లు క్లర్కులు, పనివాళ్ళు ఒకరనేముంది? నేనెవరినో, ఎందుకు

3

వాళ్ళను కలుసుకుంటున్నానో, ఎప్పుడూ దాచను, ప్రజలెప్పుడూ ఎంత స్వంత విషయాన్నైనా చెప్పడానికి జంకరు. "తిన్నయింటి వాసాలు లెక్క బెట్టకూడదన్న" సామెతను ఎప్పుడూ పాటిస్తా,

సమాచార సేకరణప్పుడు నోట్సు తీసుకోడంగాని, టేపు మీద రికార్డు చేయడంగాని నా అలవాటు కాదు. బహు శ్రద్ధగా అన్నీ వింటాను. తరవాత జ్ఞాపకంపెట్టి విన్నదంతా కాగితం మీద పెడతా. ఒక్కొక్కరోజున ఓ అరడజను మందినేనా కలుసుకొని మాట్లాడడం జరుగుతుంటుంది. సాయంకాలంనా నోట్సు, విన్నదీ, కన్నదీ, అతి స్వల్పవిషయం అయినా సరే, టేపుకి ఎక్కించేస్తా, దాని నంతనీ నా సెక్రటరీ టైపుచేసి సిద్ధం చేస్తుంది. ఓ ఏడాదిపాటు, ఈ విధంగా విషయ సంగ్రహంచేసి, అప్పుడు ఆ కాగితాలు ఎదటవేసుకుని కూర్చుంటా. వాటిని చూస్తూంటే, అన్నీ జ్ఞాపకం వచ్చేస్తాయి.

ఉదాహరణకి నా 'వీల్స్' నవల గురించి చెప్తా, దానికోసం డెట్రాయిట్లోని మోటారుకారు కర్మాగారాలలో గడిపా. మూలమూలలకంటా వెళ్ళిచూశా. ఆ పరిశ్రమలో అనుభూతం అయ్యే బిట్టుతనం, ఉద్రిక్తతల ప్రభావంవలన నా మట్టుకు నేను బహు చురుగ్గా, బండగా, మొండిగా తయారయా. మోటారుకార్ల తయ్యారీకి తలపెట్టావా అని నా భార్య హాస్యమాడింది.

"నిజం? అంటే నవల రాయగల స్థితికి వచ్చేనన్నమాట." అన్నాను, నేను.

ఇక్కడ ఒకటి చెప్పడం అవసరం. ఈ పరిశోధనంతా నేనే జరుపుకొంటా. దానిలో ఎవరి సాయం తీసుకోను. నేను "హోటల్" నవల వ్రాస్తున్నప్పుడు, మంచి ఖరీదైన హోటళ్ళలో బసకు గదులు ఉచితంగా ఇస్తామన్నారు. 'ఎయిర్‌పోర్ట్' నవల వ్రాస్తున్నప్పుడు ఏ రూటులోనైనా సరే, ఎక్కడికేనా సరే, మూడు విమానం టిక్కెట్లు ఇస్తామన్నారు. నేను నిరాకరించా.

పరిశోధన పూర్తి అయ్యాక, వ్రాతకి ఉపక్రమిస్తా. కాని వెంటనే వ్రాసేది నవల కాదు. నవలకి ఇతివృత్తం. ఒప్పో ఇది చాల కష్టంతోకూడిన పని. కాని అవసరం. ఈ ఇతివృత్తం వ్రాయడానికి కనీసం ఆరు నెలలు పడుతుంది. ఈ ఆరు నెలల శ్రమతో ఏభయి పుటల గ్రంథం తయారవుతుంది. అప్పుడు నవల వ్రాత, దానికి కనీసం సంవత్సరంన్నర.

నేను వారంలో అయిదురోజులు పని చేస్తా. రోజుకి ఆరువందలు మాటలు— అంటే రెండు టైపుచేసిన కాగితాలు— అదీ నా నియమం. ఒక్క వాక్యం వ్రాయడానికి, ఒక్క పేరా వ్రాయడానికి ఒక్కొక్కప్పుడు గంటలకి గంటలు పడుతుంది. ఓపట్టాన తృప్తి వుండదు. సోవియటు దేశంలో పర్యటించినప్పుడు, పుష్కిన్ వ్రాతప్రతులు చూసే అదృష్టం కలిగింది. ఆ మహాకవి ఒక్కొక్క పదం, ఒక్కొక్క మాటకోసం ఎంత శ్రమపడ్డారో కనబడింది. అది చూసేక నాకో సంతృప్తి కలిగింది. పుష్కిన్ లాంటి మహా మేధావి ఒక్కొక్క వాక్యాన్ని ఎన్నోమాట్లు కొట్టేసి మళ్ళీ మళ్ళీ మార్చి వ్రాసినప్పుడు, నాదేముంది? నేను దానిలోనే వున్నాననుకొన్నా. ఆ రోజున ఆ మ్యూజియం చూపిస్తున్న గైడ్ నేనెవరో ఎరక్కుండానే "వ్రాయడం మహా కష్టమయినపనండీ" అన్నాడు.

పాకిస్తాన్

కథానిక

వంకర వేళ్ళు

మూలం : అఫ్సర్ అజర్

తెనుగు సేత : "విశ్వామిత్ర"

పాకిస్తాన్‌లో సెన్సార్ అధికారుల కత్తెరకు బలైన ఈ ఉర్దూ కథ అనువాదాన్ని "అస్త్రీ అరబ్" (ఢిల్లీ) సౌజన్యంతో ప్రచురిస్తున్నాం.

పాలిపోయి, కళాకాంతులు కోల్పోయిన జనం మొహాలు సంతోషంతో విప్పారాయి. కాంతి హీనమైన వారి కండ్లు ఒక్కసారి మెరిశాయి. తడారిపోయిన వారి కళ్ళు మళ్ళీ చెమర్చాయి. గుండె నిబ్బరం లేని వాళ్ళయితే రేడియోలో వచ్చిన శుభవార్త విని అవాక్కయి పోయారు. ఓపిక వున్నవాళ్లు విలవిల లాడుతూ వీధుల్లోకొచ్చి పరస్పరం శుభాకాంక్షలందజేసుకో సాగారు.

ఎండిన రొమ్ములతో, వడిలిపోయిన చెక్కిళ్ళతో ప్రిదిలిపోయిన పెదాలతో, చర్మం కప్పిన అస్థి పంజరాల్లా అయిపోయిన ఆడంగులూ ఆనందించారు. వాళ్లు వీధులలోకి రాలేదు. కాంతిహీన మయిన కండ్లతో, ఎముకల పోగుల్లా, బాన కడుపులతో టీసచ్చేవాళ్లా వున్న తమ పిల్లలను దగ్గరకు తీసుకొని మిఠాయిలు, పిండి వంటల గురించి ముచ్చట్లు చెప్ప నారంభించారు. ఈ పిల్లలు, తమ అమ్మమ్మలూ, నాయనమ్మలూ రుచికరమైననేతి పిండి వంటల గురించి చెప్పే దేవతా కథల్లాంటి కబుర్లు వినటమే తప్ప, వాటి నెన్నడూ రుచిచూసినవారు కారు. వాళ్లు వాటిని కనీసం చూడనైనా లేదు. ఆవంటకాల గురించి మాట్లాడేటప్పుడు వాళ్ల రుచులు మనసులో మెదిలి వాళ్ళనోళ్ళలో నీరూరుతుంటే, ఇలా ఎందుకు జరుగుతుందో, ఆ స్థితిలో వాళ్ళ నోళ్ళనుంచి వెలువడే శబ్దాల్లాంటివి తామెందుకు చేయలేకపోతున్నారో అర్థంగాక ఈ పిల్లలు తెల్లమొహాలు వేసుకొని వింటూ వుండిపోయేరు....

పెద్దలతోపాటు వీధుల్లో కొచ్చిన పిల్లలు ఈరోజు ఆటలజోలికి పోలేదు. రేపు తమ ఇండ్లలో వాళ్ళ అమ్మలూ, నాయనమ్మలూ చేయబోతున్న నేతి పిండి వంటల గురించిన కబుర్లు తప్ప వాళ్ళకు మరో ధ్యాసలేకుండా పోయింది.

ఇది నిజంగానే చాలా గొప్పవార్త! రేడియోలో ఈ వార్త వినివచ్చినభర్తలు కొందరు సంతోషంపట్టలేకతమభార్యల్ని వాటేసుకొని నాట్యం చేసినంత పని చేశారు. కొందరు టపాకులు పేల్చారు. అవిలేనివాళ్ళు ఖాళీ డబ్బాలు మోగించారు. ఆ సమయానికి అవీ దొరకనివాళ్ళు ఎలక్ట్రిక్ స్తంభాలను తట్టుతూ చప్పుడు చేసి తమ ఆనందాతిరేకాన్ని ప్రకటించుకొన్నారు.

రేడియోలో వచ్చిన వార్త చాలా కాలంగా వార్చిన చప్పిడిఅన్నంతో విసిగిపోయే నేతిపోపు అన్నానికి నోచుకోనివాళ్ళుగా వున్నజనం అందరికీ సంబంధించినది. వాళ్ళు ఆ పోపన్నంరుచే మరిచిపోయారు. ఒకప్పుడు వేళ్ళవెంట నేయి కారేలా అన్నం తిన్నామని పెద్దలు చెబితే పిల్లలు ఆ మాట నమ్మలేని స్థితి వచ్చింది.

ఇంతకూ, ఇంత సంచలనం కలిగిం

చిన ఆ వార్త ఏమిటీ అంటే, విదేశాల నుంచి పెద్ద ఎత్తున నేయి దిగుమతికి ప్రభుత్వం చేసిన ఏర్పాటుకింద మొదటి విడత సరకు దేశానికి చేరింది. పట్టణాలలో పల్లెలలోకూడా రేషను దాన్ని లెక్కప్రకారం పంపిణీ చేస్తారు. ఈ ప్రకటనతోబాటు నేయి విషయంలో ప్రభుత్వ విధానాన్ని వివరించే ఒక ప్రకటన కూడా రేడియో ప్రసారం చేసింది.

గతంలో దేశంలోనేయి దొరక్కుండా చేయటంలో ప్రభుత్వం ఉద్దేశ్యం ఏమిటంటే–ప్రజలు అది ఎంత విలువైన పదార్థమో, దాన్ని పొదుపుగా వాడుకోవటం ఎంత ముఖ్యమో గ్రహించేలా చేయటం. అన్ని విషయాల్లోనూ ప్రజలు పొదుపు అలవరచుకోవాలి. పొదుపు చేయకపోతే వనరులు పెరగవు వనరులు పెరగందే సంక్షేమాభివృద్ధి జరగదు కదా?

ఈ సంక్షేమం గురించిన కబుర్లు పదేళ్ళుగా జనం వింటున్నవే. కబుర్లే తప్ప ఆ సంక్షేమం తాలూకు ఛాయలు కూడా ఇంతవరకు వాళ్ళకు సోకలేదు. అవసరాలను నానాటికీ తగ్గించుకోవటం ఒక్కటే వారి వంతయింది.

విదేశాలనుంచి నేయిదిగుమతికావటం సంక్షేమ యుగారంభానికి సూచన అని కూడా రేడియోలో చెప్పారు.

వార్తల తరువాత వ్యాఖ్యల్లో ఇలా చెప్పారు. "నెయ్యి దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించటం అచ్చంగా ప్రజల మేలుకోసమే. లేకపోతే మనదేశ ఆర్థిక వ్యవస్థ ఇలాంటి విలాస వస్తువుల కోసం విదేశీమారక ద్రవ్యం ఖర్చుపెట్టగలస్థితిలోలేదని వేరే చెప్పనవసరంలేదు. చక్కెర ధర కాస్త పెరిగిన మరుక్షణం మన దేశంలో ప్రభుత్వం కూలిపోయిన రోజులున్నవి. అయితే, ఆ రోజులు గతించాయి. ప్రభుత్వ కృషి ఫలితంగా ఇప్పుడు మన ప్రజలకు కష్టపడి పని చేయటం అవసరమనే చైతన్యం ఏర్పడింది. వారిప్పుడు నిరసన ప్రదర్శనలు చేయటం గాక, సాహసంతో కష్టాల నెదుర్కొనటం, తమ శక్తినంతా ధారపోసి పనిచేయటం నేర్చుకొన్నారు. అందుచేతనే దేశంలో ఉత్పత్తి పెరిగింది. మన ఎగుమతులు పెరిగాయి. విదేశ మారక ద్రవ్యం ఇదివరకటికన్నా బాగా ఆదా అవుతూంది, కాని మనమింకా పూర్తిగా స్వశక్తిపై ఆధారపడే స్థితికి చేరుకోలేదని గుర్తుంచుకోవాలి."

ఈ ముక్కలు రేడియోవాళ్ళు రోజూ వల్లిస్తున్నవే. శ్రోతల దృష్టిలో ఈ మాటలకు అర్థంపర్థం లేకుండాపోయింది. వాళ్లు రేడియో వార్తలపై సొంత పద్ధతిలో వ్యాఖ్యలు చేస్తున్నారు. ఉత్పత్తి పెరగటం అంటే జనాభా పెరగడమన్న మాట. ఎగుమతులు పెరుగుతున్నాయంటే వారి దృష్టిలో మంత్రుల, ఉన్నతాధికారుల కొడుకులూ, కూతుళ్ళు, బావమరదులు వ్యాపారాల కోసమో, పై చదువుల కోసమో విదేశాలకు వెళ్ళడం ఎక్కువైందన్న మాట. విదేశీ మారక ద్రవ్యం పెరగటమంటే, స్విస్‌బ్యాంకుల్లో పెద్దల ఖాతాల్లో జమలు పెరగడమని వాళ్ళు నిర్ధారణ చేశారు.

కాని, ఈ వ్యంగ్య వ్యాఖ్యలు ఈ [illegible] ఎన్నడూ అసమ్మతి ప్రదర్శనలకు తావు తీయలేదు. ధరలు పెరిగి పోవటమూ జనానికి తీరిక లేక పోవటమూ యిందుకు కారణం. ధరలు పెరగడంతో

యిబ్బడి ముబ్బడి పనిచేస్తే కాని జనానికి పొట్ట గడవటం లేదు. అంతా ఓవర్ టైము చేస్తున్నారు. తన ఉద్యోగులకు కూడా, ఆఫీసు పని తరవాత చిల్లర మల్లర పార్టు టైము వుద్యోగాలు చేసుకొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనం యంత్రాలుగా మారిపోయారు. ఇంట్లో పొయ్యి రాజాలంటే ప్రతి వస్తువూ ఏ పూటకాపూట కొనుక్కోవలసి వస్తుంది. ప్రభుత్వం రోజు రేషన్ ప్రవేశపెట్టింది. మొగవాళ్ళకు పగలంతా ఆఫీసుల్లో పనీ, ఆడవాళ్ళకూ, పిల్లలకూ సంచులూ, డబ్బాలూ పుచ్చుకొని రేషన్ దుకాణాల ముందు పడిగాపులు కాచే పని సరిపోతూ వుంది.

నెయ్యి పంపిణీ ఏర్పాట్ల గురించి రేడియోలో వివరంగా చెప్పారు. నగరాన్ని నాలుగు భాగాలు చేశారు. ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క అధికారినీ, అతడి కింద ఒక సహాయాధికారినీ ప్రభుత్వం నియమించింది. ఇంత కాలానికి మళ్ళీ జరుగుతున్న ఈ నెయి పంపిణీని జాతి సమైక్యతా వ్యక్తీకరణ చేయాలని కూడా ప్రభుత్వం సంకల్పించింది. అందుకని, ఈ పంపిణీ సూత్రాలు రేషన్ దుకాణాల వద్ద గాక, అధికార పార్టీ ప్రాంతీయ కార్యాలయాల వద్ద జరగాలని నిర్ణయించబడింది. ఈ నిర్ణయానికి మరో కారణం కూడా వుంది. అదేమంటే నగరంలో రేషన్ దుకాణాల కన్నా అధికార పార్టీ కార్యాలయాలే ఎక్కువ వుండటం.

ఆ రోజు రాత్రి నగరంలో నెయ్యి దిగుమతి ఉత్సవాన్ని పురస్కరించుకొని బాణాసంచా కాల్చారు. అధికార పార్టీ వారు యింటింటికీ తిరిగి మతాబాలు, చిచ్చుబుడ్లు పంచారు. వాటి వెలుగుల అందాన్ని యినుమడింప జేసే వుద్దేశంతోనూ, విద్యుచ్ఛక్తి వాడకంలో పొదుపు సాధించే సంకల్పంతోనూ కూడా ఎలక్ట్రిసిటీ బోర్డు వారు ఆ రోజు రాత్రి నగరంలో పూర్తి బ్లాక్ అవుట్ అమలు జరిపారు.

* * *

దేశంలో కొన్ని సంవత్సరాలుగా నెయ్యి లేకుండా పోవడానికి కారణం గేదెలు పాలివ్వకనూ కాదు, నెయ్యి కార్ఖానాలు పని చేయకనూ కాదు. ప్రజల మేలు కోరి ప్రభుత్వమే దేశంలో నెయ్యి లేకుండా చేసింది. పెట్టుబడిదారుల దోపిడీ నుంచి కార్మికులను విముక్తి కల్పించే సదుద్దేశంతో ప్రభుత్వం నెయ్యి తయారు చేసే కార్ఖానాలను స్వాధీనం చేసుకొంది. శాస్త్రవేత్తలు తమ పరిశోధనా ఫలితాలను మిళాయించి నేతిని అపూర్వమైన పౌష్టిక పదార్థంగా మార్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ దాన్ని పరమాద్భుత పదార్థమని ప్రశంసించింది. ఈ నెయ్యి తింటే జనం భీముల్లా తయారవుతారు. యౌవనం చిరకాలం నిలుస్తుంది. వృద్ధాప్యం వెనక్కు పోతుంది. రోగాలు దాన్ని తినేవారి ఛాయలకైనా రావు అని ఆ సంస్థ ప్రవీణులు సర్టిఫికెట్ యిచ్చారు. కాని ఈ కొత్త ప్రక్రియవల్ల నెయ్యి ధర అమాంతం పెరిగి జనానికి అందకుండా పోయింది. అందుకని ప్రభుత్వం, దేశం మేలుకోరి దాన్ని పై దేశాల్లో అమ్మి, డబ్బు సంపాదించి దేశాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రజలకు యిలా వివరించింది :

"మనం విలాసాలకు దాసులం కారాదు. జిహ్వాచాపల్యాలకు లొంగరాదు. ప్రతిభావంతులైన మన శాస్త్రవేత్తలు అద్భుతమైన నేతిని తయారుచేసినందుకు మనం వారిని అభినందించాలి. కాని మనం ఆ జాతీయ సంపదను వ్యర్థం చెయ్యరాదు. దాన్ని పై దేశాల్లో అమ్మి డబ్బు సంపాదించాలి. ఆ డబ్బుతో మన దేశంలో పెద్ద పెద్ద పరిశ్రమల్ని నిర్మించాలి. ముందు తరాల వారికోసం మనం త్యాగాలు చేయాలి. ప్రతి పౌరుడూ ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తాడని మా నమ్మకం. ఇదే మీ దేశభక్తికి గీటురాయి.

ఆ రోజు రాత్రి ఆరోగ్యం, కుటుంబ నియంత్రణశాఖ మంత్రిగారు టెలివిజన్‌లో ప్రసంగిస్తూ, ప్రభుత్వ నిర్ణయాన్ని యిలా వివరించారు:

"నెయ్యి ఎగుమతి చేయాలని ప్రభుత్వం చేసిన నిర్ణయం ఎంతో విజ్ఞతాయుతమైంది. మన దేశంలో జనాభా పెరుగుదల యిప్పటికే చాలా ప్రమాదకరంగా తయారైంది. జననాల రేటు పెరిగిపోతూవుంది. మరణాలు తగ్గిపోయాయి. ఈ స్థితిలో మనం, మన దేశంలో తయారవుతున్న అద్భుతమైన నేయిని వాడటం కొనసాగిస్తే మన దేశానికి భవిష్యత్తు శూన్యమని ఘంటాపథంగా చెప్పగలను. 7-8 ఏళ్ళలో దేశ జనాభా ఎంత పెరిగిపోతుందంటే మనుషులు మనుషుల్ని పీక్కు తినాల్సి వస్తుంది ఈ నెయ్యివల్ల ఆకలి పెరుగుతుంది. ఇబ్బడి ముబ్బడి తిండి కావలసి వస్తుంది. అప్పుడు తల్లి దండ్రులే తమ బిడ్డల్ని నమిలి మింగేస్తారు."

రేడియోలో ప్రకటన వచ్చిన మరునాడు జనం తెలతెల్లవారుతుండగానే చప్పిడి టీ యింత గొంతులో పోసుకొని – చక్కెర కూడా అద్భుత పౌష్టిక పదార్థమే అని శాస్త్రవేత్తలు నిర్ణయించిన కారణాన, ప్రభుత్వం జనం మేలుకోరి దాన్ని కూడా ఎగుమతుల జాబితాలో చేర్చేసింది. గిన్నెలు, డబ్బాలు పుచ్చుకొని అధికార పార్టీ కార్యాలయాలవైపు బయలుదేరారు.

ం ం ం

మూడో నంబరు పంపిణీ కేంద్రం దగ్గర క్యూలో నిలబడిన జనాన్ని ఉద్దేశించి పంపిణీ అధికారి ఉపన్యాస ధోరణిలో యిలా చెప్పాడు: "నెయ్యి పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించిన సూత్రాలు ముందు మీకు వివరిస్తాను. మన ప్రభుత్వం జాతీయ పొదుపు విధానానికి పూర్తి అనుగుణంగా ఈ సూత్రాలను రూపొందించింది. మీరు వీటిని ఖచ్చితంగా పాటిస్తూ, మీ దేశభక్తిని నిరూపించుకోగలరని ప్రభుత్వం ఆశిస్తూవుంది."

ఇలాంటి ఉపన్యాసాలు విని విని విసిగిపోయిన జనం క్యూలో తమ ముందూ, వెనుక వున్న వాళ్ళతో బాతాఖానీకి దిగారు.

పంపిణీ సిబ్బంది వెంట బందోబస్తుకోసం వచ్చిన పోలీసు అధికారి "నిశ్శబ్దం...అంతా నిశ్శబ్దంగా వుండాలి" అని భయంకరంగా కేకపెట్టాడు. అతడితో వచ్చిన పాతిక ముప్పైమంది పోలీసులు చప్పుడుచేస్తూ తుపాకులు సర్దుకొని అటెన్షన్‌లో నిలబడటం చూచి జనం నోళ్లు మూతపడ్డాయి.

పంపిణీ అధికారి మళ్ళా ఆరంభించాడు. "నెయ్యి మీ అందరికీ సమానంగా పంచుతాం. మీ చూపుడువేలికి అంటినంత నెయ్యి లభిస్తుంది." "చూపుడు వేలు కొచ్చినంత నెయ్యి" జనం వుండబట్టలేక ఒక్కసారే అనేశారు.

పోలీసు అధికారి మళ్ళా "అంతా నిశ్శబ్దంగా వుండాలి, నోరు మెదిపినా, వున్న చోటునుంచి కదిలినా మిమ్మల్ని పిట్టల్లా కాల్చిపారేస్తాం" అని గర్జించాడు.

మళ్ళా జనం నోళ్ళు కాస్త మూతపడ్డవి. పంపిణీ అధికారి ఆఫీసు వరండాలో ఎత్తుగా బల్లమీద వుంచిన ఒక డబ్బాచూపి, జనం ఒక్కొక్కరే తమ రేషన్ కార్డుమీద ముందుగా ఎలా గుర్తు వేయించుకోవాలో, ఆ తరువాత డబ్బా దగ్గరకు వెళ్ళి కుడిచేతి చూపుడు వేలు నిటారుగా వుంచి, నేతిని ఎలా తీసుకోవాలో వివరంగా అభినయించి చూపాడు. మరో అర్థగంటలో నెయ్యి లారీ వస్తుందని ప్రకటించాడు.

ఏప్రిల్ ఎండకు పైన తలలూ, కింద కాళ్ళూ మాడిపోతుంటే జనం అలానే చెమటలు కార్చుతూ చాలాసేపు నిలబడ్డారు. మధ్య మధ్య కాస్త అలజడి ఏర్పడినప్పుడల్లా పోలీసుల అదిలింపులు సాగాయి.

చివరకు, ఒక గంట తరువాత నేతి పీపాలతో లారీ వచ్చింది. దానివెంట వచ్చిన రాక్షసుడులాంటి ఒక కురూపి సైనికాధికారి క్యూలో నిలబడ్డ జనాన్ని ఈసడింపుగా చూస్తూ, ఠీవిగా వరండా దాకా నడిచివెళ్ళి జనాన్ని ఉద్దేశించి తనూ ఒక చిన్న వుపన్యాసం దంచాడు

"మీరు డబ్బాలూ, తప్పేలాలూ పట్టుకొచ్చారు. ఇప్పుడు యిదేం బాగా లేదు. మీకింకా పాత వాసనలు వదల్లేదని దీన్నిబట్టి రుజువు అవుతూంది. నెయ్యి ఎంత అమూల్యమైన పదార్థమో, దాన్ని ఎంత పొదుపుగా వాడుకోవాలో మీకింకా బోధపడకపోవటం విచారించదగ్గ విషయం.... పెద్ద పెద్ద డబ్బాలూ గిన్నెలు వేసుకొచ్చారు...."

"ఉపన్యాసం చాలు, నెయ్యి ఇవ్వండి" అంటూ జనం కేకలువేశారు.

పోలీసుల అదిలింపులతో జనం కాస్త సద్దుమణిగిన తరువాత పంపిణీ ఆరంభమైంది.

దాదాపు ముప్పైమంది వరుసలో వెళ్ళి నేతిడబ్బాలో వేలుముంచి తెల్ల మొహాలు వేసుకొని వెళ్ళిపోయారు.

క్యూలో కల్లూపంతువచ్చింది అతడు అధికారపార్టీ కార్యకర్త. అతడి చూపుడు వేలు వంకర అతడి వేలికి ఇంచుమించు ఒక ముండు చెమ్చాడు నెయ్యి అంటుకొంది. వేలికి అంటిన నేతిని ఎడమ అరచేతిలో వేసుకొని కల్లూ హుషారుగా ఈలవేస్తూ నడిచిపోయాడు.

జనానికి ఒళ్ళు మండింది. "ఇది అన్యాయం. మాకూ అంత నెయ్యి రావలసిందే" అంటూ గొడవ మొదలుపెట్టారు. పోలీసులు తుపాకు లెక్కుపెట్టి నిలబడ్డారు.

పంపిణీ అధికారి, నెయ్యి పంపిణీ సందర్భంలో ప్రభుత్వం ప్రకటించిన సచిత్ర కరపత్రం తీసి, దాన్ని గాలిలో ఊపుతూ గంభీరంగా ఇలా అన్నాడు.

"రూల్సులో స్పష్టంగా వుంది. చూపుడు వేలుతో నెయ్యి తీసుకోవాలి కల్లూకు వంకర వేలుండటం దైవికం.

చూపుడు వేలు అని వుంది గనుక, దానితోనే నేయి తీసుకోవటం అతడి జన్మ హక్కు, పూర్తిగా చట్టసమ్మతం''

జనం వినిపించుకోలేదు.

''మేమూ వేలు వంకరపెట్టే నెయ్యి తీస్తాం'' అంటూ కొందరు యువకులు ఉద్రేకంతో కేకలు పెట్టారు.

''వంకర వేలు .... జన్మ హక్కు'' అంటూ ఎవరో కేకపెట్టారు.

''ఇది చట్ట విరుద్ధం'' అంటూ పంపిణీ అధికారి, పోలీసు అధికారికి సైగ చేశాడు.

క్యూ చెదిరిపోయింది. జనం ముందుకు తోసుకురాసాగారు.

పోలీసు అధికారి "వన్. టు, త్రీ-ఫైర్" అనేశాడు.

పోలీసులు తుపాకులు కాల్చారు. పది పన్నెండుమంది అక్కడికక్కడే నేల కొరిగారు. మిగతా జనం గిన్నెలు, డబ్బాలు పారేసి పరుగులు తీశారు.

నెయ్యి పంపిణీ ఆగిపోయింది. కర్ఫ్యూ విధించబడింది,

మంత్రివర్గం హుటాహుటిన సమావేశమై నెయ్యి పంపిణీని నిలిపివేసింది. దేశంలో ఎవరికి వంకర వేళ్ళున్నా వాటిని నరికించాలని ఉత్తర్వులిచ్చింది.

దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. అమాంబాపతు డాక్టర్లను సమీకరించి వంకర వేళ్ళు ఖండించడానికి జట్లు జట్లుగా దేశం నలుమూలలకు పంపారు. డాక్టర్లు తగినంతమంది దొరక్కపోగా కసాయి వారికి ఆపని అప్పగించారు.

వారం రోజులలో ఈ కార్యక్రమం పూర్తి అయింది.

కాని, ఆ తరువాత దేశంలో పుట్టిన వాళ్ళంతా వంకరవేళ్ళతోనే పుట్టారు.

మనవి

మాకు పంపే చెక్కులు, డ్రాఫ్టులు మనియార్డర్లు మొదలయినవి వ్యక్తుల పేరిట కాక 'అభ్యుదయ' పేరిటనే వ్రాయాలి.

గమనిక

"అభ్యుదయ" యీ సంచిక నుండీ 62 పేజీలతో వెలువడుతుంది కాగితం, ముద్రణ ఖర్చులు పెరుగుతూ వుండడంవల్ల వెల పెంచక తప్పలేదు. ఇకమీదట సం॥ చందా పది రూపాయలు. విడిప్రతి ఒక రూపాయి. పాఠకులు, చందాదారులు, ఏజెంట్లు గమనించవలసిందిగా మనవి. పూర్వపు చందాదారులు అదనపు పైకాన్ని పంపవలసిందిగా కోరుతున్నాము.

— మేనేజర్

వీరేశలింగంగారికి జరిగిన అన్యాయం

అక్కిరాజు రమాపతి రావు

ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితం కాకినాడలో ఓ శాస్త్రిగారితో వీరేశలింగం గారి గూర్చిన ప్రస్తావన వచ్చినపుడు – 'ఆమెగారు ఆయన్ను వంటింట్లోకి రానిచ్చేది కాదు, నడిమి హాల్లోనే ఆయనకు భోజనం పెట్టేది' అన్నారు, ఆయన స్వయంగా చూసినంత ధీమాగా ఆయన సతీమణి రాజ్యలక్ష్మమ్మగారి గురించి.

ఇటీవల కూడా ఇటువంటి మాట ఒకటి తిరుపతిలో వినవచ్చింది. ఆ చల్లనితల్లి వితంతు వివాహాల విషయంగా వీరేశలింగంగారికి తోడుపడలేదట – అని ఎక్కడో చదివినట్లో, ఎవరో చెప్పినట్లో తాము విన్నామని ఒకరన్నారు.

కాని యీ మాటలు నిజంకాదు. వీరేశలింగంగారి భార్య, రాజ్యలక్ష్మమ్మ గారు మహాదొడ్డయిల్లాలు, భర్తకి అన్నివిధాలా తగిన భార్య. వీరేశలింగం స్వీయచరిత్ర 1911 లో తొలిసారి విజ్ఞాన చంద్రికా మండలివారు అచ్చువేశారు. అందులో పంతులు గారి చేతివ్రాత మచ్చుగా ఆయన స్వీయచరిత్రను తన ఇల్లాలికి అంకితంచేసిన వాక్యాలు మొదటి పుటగా అచ్చువేశారు. అది ఈవిధంగా వుంది.

"నేను చేసిన సమస్త ప్రయత్నములలోను
ఛాయవలె నాతోడనుండి నన్ను ప్రోత్సాహపరచుచు
ధర్మమార్గానుసరణమునందు నాతోడగూడ
సకల కష్టములను సంతోషపూర్వకముగ సహించుచు
సత్యమైన సహధర్మచారిణియయి
తల్లి బిడ్డకువలె నన్నాదరానురాగముతోడ
సహస్ర హస్తములతో సదా నాకు సంరక్షణము చేయుచు
ఏబది సంవత్సరముల కాలము
నా ప్రాణమునకు ప్రాణమయి యుండిన
నా యర్ధాంగ లక్ష్మియైన రాజ్యలక్ష్మికి
దీని నే నంకితము చేయుచున్నాను"

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలివారు ప్రచురించిన మొదటి భాగంలో లోపలి ముఖపత్రం తిప్పగానే పంతులుగారి దస్తూరీ మచ్చుపుట ముద్రితమై కళ్ళపండుగ్గా వుంది. అప్పటికి రాజ్యలక్ష్మమ్మగారు పరమపదించి సంవత్సరం అయినా గడిచిందో లేదో! 1915 వ సంవత్సరం వీరేశలింగంగారి స్వీయచరిత్ర రెండోభాగం వెలువడింది. ఈ రెండోభాగంలో చివరి ప్రకరణం 'అసహాయ దశ' అనేది. ఈ అసహాయ దశ అంతా రాజ్యలక్ష్మమ్మగారి గుణగణాలను గూర్చి ఆయన విలాపమే కనపడుతుంది.

"మనుష్యమాత్రురాలగుటచేత నా భార్యయందును కొన్ని లోపములున్నను గుణ బాహుళ్యమునుబట్టి యామెను స్త్రీరత్నమని చెప్పవచ్చును. అట్టి స్త్రీరత్నము మందభాగ్యుడనైన నాకు కడవరకును దక్కకున్నందుకు ఖేదము నొందుచున్నాను."

(పుట 437 - ద్వితీయ ముద్రణం - 1936)

"తాను చేయవలసిన కృత్యములలోనెల్ల నా సంరక్షణము తనకు ప్రథమ కర్తవ్యముగా భావించి నన్ను పసిబిడ్డను పెంచునట్లు పెంచుచుండెడిది. నేనే మంచి పనికి బూనినను నాకు సహాయురాలైయుండి సమస్త విషయములలోను ఛాయవలె నన్ననుసరించుచు సహధర్మచారిణి యని పిలువబడుటకు సర్వవిధముల నర్హురాలై యుండెను. వితంతు వివాహ ప్రయత్నమువలన నేను జాతి బహిష్కృతుడ నయినను బ్రహ్మమతానుష్ఠానపరుడనయి యజ్ఞోపవీత విసర్జనము చేయుటవలన కొన్ని నూతన కష్టములకు పాత్రుడనయినను నన్ను నిరుత్సాహపరుపక హృదయపూర్వకముగా నన్ననువర్తించుచుండెను."

(పు॥ 436 - ద్వి॥ ము॥ - 1936)

అని వ్రాసుకొన్నారు పంతులుగారు స్వీయచరిత్రలో. కాబట్టి వీరేశలింగం పంతులుగారి స్వీయచరిత్ర ఆద్యంతాలు రాజ్యలక్ష్మమ్మగారి స్మరణంతోనే వుందన్నమాట. మన ఆలంకారికులు ధర్మపత్నిని 'స్వీయ' అన్నారు. కాబట్టి పంతులుగారి 'స్వీయ' చరిత్ర అంటే రాజ్యలక్ష్మమ్మగారి చరిత్రమే నన్నమాట. సీతమ్మ కథనే రామాయణ మన్నట్లు.

ఇది ఈ విధంగా వుండగా వీరేశలింగంగారిని అనృతవాదిని చేయటం ఎంత పొరపాటు, వింత, అన్యాయం!

"ఈ వివాహంలో సంఘంలోని అలజడికి భయపడి వంటబ్రాహ్మణుడు మాయమైపోగా నా భార్యయే గోదావరినుండి నీళ్ళుమోసుకొనివచ్చి వంట మొదలైన పనులెల్లను స్వయముగాచేసి యెంతో కష్టపడవలసిన దయ్యెను. ఈ కార్యములయందు నావలెనే నా భార్యయు బద్ధాదరము కలదయి సర్వకష్టములను సంతోష పూర్వకముగా సహించి నన్ననుసరించు సహధర్మచారిణి యన్న పేరన్వర్థము చేయుచుండెను. నా భార్యయొక్క యానుకూల్యమే లేకయుండిన యెడల నేనిన్ని కార్యములను నిరంతరాయముగా నిర్వహింపలేక యుందునేమో!"

(స్వీ. చ. మొదటిభాగం పుట 258-1936)

పంతులుగారీ వాక్యాలు వ్రాసేనాటికి రాజ్యలక్ష్మమ్మగారు జీవించే వున్నారు. స్వీయచరిత్రలో రాజ్యలక్ష్మమ్మగారి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆమె సద్గుణాలను గూర్చి ఎంతగానో సంతోషంతో ప్రస్తావించారు వారు.

"నాది కొంత కోపస్వభావము, నా భార్యది శాంత స్వభావము. ఎప్పుడైన చిత్తోద్రేకము కలిగినప్పుడు నే నెవ్వరిని లక్ష్యము చేయక ముందు విచారింపక తొందరపడి మత్తగజమువలె సంచరింప జూచినప్పుడు తా నంకుశమయి నన్ను మరలించి యుక్తసమయమున శాంత వాక్యసుధారసముతో నన్నప్పుడు మరల స్వస్థచిత్తుని చేయుచుండును." (పుట 426 ద్వి. ము - ద్వి. భా - 1936).

ఇంతకూ పంతులుగారికి జరిగిన అన్యాయం ఏమంటే, విజ్ఞానచంద్రికా గ్రంథమండలివారు ప్రచురించిన ప్రథమ ముద్రణంలో తప్పు రాజ్యలక్ష్మమ్మగారికి పంతులుగారు తమ స్వీయచరిత్రను అంకితం చేశారన్న విషయం కనపడనే కన పడక పోవడం.

1936 లో ద్వితీయ ముద్రణం హితకారిణీ సమాజంవారు ప్రచురించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ఈ ముద్రణకు పీఠిక కూర్చారు. ఆయనగారు పుస్తకాలు చదివి వినిపించుకోవలసిందే తప్ప, స్వయంగా చదువుకొనేస్థితి అనాటికే పోగొట్టు కొన్నందువల్లనో ఏమో, ఈ అంకితం విషయం వదిలేసిన విషయం గ్రహించలేకపోయి వుంటారు.

1954 లో హితకారిణీ సమాజంవారు పంతులుగారి స్వీయచరిత్రను మూడో సారి ముద్రించారు. ఈ ముద్రణకు భావరాజు వేంకట కృష్ణారావుగారు పీఠిక వ్రాశారు. ఆయన పంతులుగారు రాజ్యలక్ష్మమ్మగారికే స్వీయచరిత్రం అంకితం చేశారన్న విషయం కూడా ప్రస్తావించనేలేదు.

1962 లో స్వీయ చరిత్రకు సంక్షిప్త ముద్రణం వెలువడింది. దీనిని కూడా హితకారిణీ సమాజంవారే ప్రచురించారు. సంక్షిప్తపరచింది అంకరాజు శంకరరావు గారు. ఈ ముద్రణలో రాజ్యలక్ష్మమ్మగారు అంకితం తీసుకొన్న విషయంలేదు. వీరేశలింగం పంతులుగారు తమ సర్వస్వం సమర్పించిన హితకారిణీ సమాజంవారు, ఆయన స్వీయచరిత్ర ప్రచురిస్తూ ఇంతటి ముఖ్యవిషయం గ్రహించకపోవడం చాలా విచారకరం. వాళ్ళ నిర్లక్ష్యం తలచుకొంటే చాలా బాధకలుగుతుంది

ఇటీవల నేషనల్ బుక్ ట్రస్టువారు వీరేశలింగంగారి స్వీయచరిత్ర సంక్షిప్త ప్రతిని ప్రచురించారు. ఈ సంక్షిప్త ప్రతి సంపాదకులు కొడవటిగంటి కుటుంబరావు గారు. వీరు కూడా పైన పేర్కొన్న ఘోరమైన పొరపాటునే మళ్ళీ చేయడం చాలా చాలా విచారించవలసిన విషయం.

పందొమ్మిదో శతాబ్ది మొత్తటికీ, ఒకే ఒక్క తెలుగు మహాపురుషుని పేరు స్మరించుకోవాలంటే స్మరించవలసిన వారు వీరేశలింగమే. ఈ మహాపురుషుణ్ణి రేపు నేషనల్ బుక్ట్రస్టువారు ఇతర భారతీయ భాషలవారికి పరిచయం చేయడానికి పూను కొంటే, కుటుంబరావుగారు తీసుకోవలసినంత శ్రద్ధ తీసుకోకపోయి నందువల్ల ఆయనకు గొప్ప అన్యాయమే చేసినవారైనారు.

వీరేశలింగంగారిని ఎంతగానో అభిమానించిన, ఆరాధించిన చాలామంది పెద్ద లకు, పాలపర్తి నరసింహం, రాయసం వెంకటశివుడు, జయంతి గంగన్న, గిడుగు రామమూర్తి పంతులు, భమిడిపాటి కామేశ్వరరావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆదిరాజు వీరభద్రరావుగారి వంటి వారికి ఈ విషయం ఎందుకు దృష్టికి రాలేదో ఆశ్చర్యకరం. వీరిలో చాలా మంది రెండు మూడు ముద్ర ణలు స్వీయచరిత్ర చూసి ఉండవచ్చు.

వల్లథోల్ కవితా ఖండాలు

నందుని యింట దేవుడు వెలిగించిన
అందాల దీప మిది,
యశోద గుండెమీద మెరిసే
నీలమణి యిది,
గోపికా లతా శ్రేణులపైని విహరించే
రమ్యమైన పక్షి యిది,
యమునా తీరాన క్రీడించే
నల్లహంస యిది.
గొల్ల పిల్లల ప్రియమిత్ర మిది
వేద విదు లెరిగిన స్వర్లోక సత్యమిది

0 0 0

దూర దూరాల నుంచి
తొంగి చూస్తోంది ప్రభాతం
దాని చెక్కిళ్ళపైని ఆనందపు
వెలుగులు
మింటి మీంచి రాలిపడే
భక్తి బాష్పాల్లా మంచు బిందువులు
కొత్త బుద్ధుణ్ణి [గాంధీజీ] చూడా
లన్న తమకంతో
సర్వమూ మేలుకొంది,
అంతటా వెలుగులు....
అతని పాద పద్మాలకు
ప్రణమిల్లాలంటే
అయ్యో, అంతటా
కిక్కిరిసిన జన సందోహం
పట్టులా మెత్తగా వున్న ఆయన
పవిత్ర పాదయుగళి
రవ్వంతగా తాకడం మాత్రం సాధ్య
పడింది. ఎటువంటి పాపిని నేను ?
అదృష్టం వారణాశికి తీసుక వెళ్ళినా,
గంగా స్నానం చెయ్యలేక పోయాను.

0 0 0

నీ సుందర రూపాన్ని, ఓ కవితా
అంతటా మెరుపులు వెదజల్లే
వీరుని కత్తి ఝళిపింపులో
చూస్తున్నాను.
తన గుండెను పరవశింప చేసిన
ప్రియునిపై ఒరిగే కురంగ నయన
చూపుల్లో చూస్తున్నాను.
ఆనందంగా ఆడుకుంటోన్న
పసిపాప స్వేద బిందువులు నిండి
వికసించే చెక్కిళ్ళలో చూస్తున్నాను
ఓ కవితా నీ సుందర రూపాన్ని.

0 0 0

గమ్యాన్ని చేరితేనేం, చేరకుంటేనేం
త్రోవలో చనిపోతేనేం——
తడబడని అడుగులతో
సాగిపోతాను ముందుకు
ముళ్ళు తొక్కివేస్తూ
సాగిపోతాను ముందుకు,
నా వెనుకనడిచే యువకుల లేత పాదాలు
బాధ పడకుండా సాగుతాను మున్ముందుకు

0 0 0

ఓ మరణ దేవతా, కాదనను విన్నా
నీ సోదరి నిద్రాదేవి
చెప్పింది నీ గురించి అంతా నాకు
నీ విషాద రాజ్యపు వింతలు,
శ్రమించి సమకూర్చుకున్న
నా గుండెల్లో ప్రేమను
ఎవ్వరి కర్పించేది నీ రాజ్యంలో
ముద్దుగా పెంచుకుంటోన్న
మా అమ్మాయి 'సానుభూతి'
నీ శూన్య నగరంలో
తన కన్నీటి ముత్యాలహారాన్ని
ఎవరి మెడను అలంకరించాలి ?

0 0 0

జాషువా గారి 'గబ్బిలము'

మురళీ కృష్ణ

కృతిలో సామాజిక అవగాహన ఎంత స్పష్టంగా ఉంటే కవిత్వం అంత విస్పష్టంగా ఉంటుంది. అకళంకమైన అనుభూతి అతి ఉదాత్తమైన కవిత్వమునకు దారి తీస్తుంది. సామాజిక చైతన్యంలో తాదాత్మ్యం పొందిన కవి విద్యుత్తుగా ఉపకరించాలి. కవి గుండెల్లోంచి వెలువడి వచ్చు రసానుభూతి పాఠకుని నరాల్లోంచి పొచ్చుకొనిపోయి ఆలోచింప చేస్తుంది. అటువంటి రసావేశమే ఉత్తమ కవిత్వాన్ని సృష్టించ కలుగుతుంది. ఈ పర్వణాలకి ప్రత్యక్ష ప్రమాణం జాషువా కవిత్వం. జాషువా రసావేశానికి ప్రతీక "గబ్బిలము" కావ్యం. ఆత్మఘోష "గబ్బిలము" కావ్యానికి అంతరంగం.

ఈ కావ్యాన్ని జాషువా గారు 1941 ప్రాంతంలో రచించారు. అరుంధతీ సుతుడు గబ్బిలం ద్వారా పరమేశ్వరునికు అశ్రుసందేశం పంపడమే ఇందలి ఇతివృత్తము. జాషువా తన కావ్యానికి "గబ్బిలము" అని పేరు పెట్టడంలో విశిష్టత గోచరిస్తుంది. గబ్బిలం అంధకారానికి చిహ్నం ముక్కు మొగమున్న చీకటిముద్దవో తెలసి గబ్బిలాన్ని వర్ణించారు. పంచముల జీవితములకు వెలుగు రాదు. గబ్బిలం వెలుగు చూడలేదు. అందువలననే పంచమ జాతి చిహ్నంగా కావ్యానికి "గబ్బిలము" అని పేరు పెట్టారని భావించవచ్చు. కవి హృదయాంతర్గతమైన ఈ భావాన్ని క్రింది పాదాలలో పొందు పరిచారు.

"నా జాతి యెత్తుకే తన రాజంబున
వీడు మూర్తి ప్రాయింతుం జెలీ"

ఈ కావ్యంలో జాషువా గారి ఆశయాలు ప్రస్ఫుటమవుతాయి. వారి ఆశయాల్లో దళితజాత్యుద్ధరణ ప్రధానభాగం. సంఘంలో అట్టడుగునపడి ఉన్న సోదరులకు చేయి అందివ్వడానికి నిరంతరం కృషి చేయడం వీరి ప్రధాన ఆశయం. రెండవది దురాచారములు, సమకాలీన సమాజములోని లోపములు తూర్పారబట్టి నిత్య నూతన సమాజస్థాపన. "జాతులందు మిగులజాతి యేదెక్కువో, ఎరుక లేక తిరుగ నేమి ఫలము" అని వేమన జాతి దురహంకారాన్ని నిరశించి విజ్ఞుడైన వాడే "ఎచ్చయిన కులజుడు" అని ప్రవచించాడు. "మంచియన్నది మాలయైతే మాలనగునేడన్" అని గురజాడ ప్రవచించాడు. వీరి అభిప్రాయంలో కులం అంటే విజ్ఞానాన్ని బట్టి నిర్ణయించాలి. మంచితనం, విజ్ఞానం ఉన్నా పంచమ జాతిలో పుట్టిన వారి కష్టములను కళ్ళకు గట్టినట్టుగా వర్ణించారు.

అమాయకత్వం వీరి సొత్తు. వీరు "చెప్పులు కుట్టి జీవనము చేయుచుగాని నిరాకరింపలేదెప్పుడు". పంచమ జాతికి భరతమాత గూడా అప్పు పడింది, వీరి కష్టానికి తగిన ప్రతిఫలం లభించక పోయినా తగిన స్థానమైనా లభించలేదు. అందుకే "దాని తలమీద (బుట్టిన పంకిలములు, గగిగి కడిగింప లేదయ్యె గగనగంగ." వీరి జీవితాల్ని బాగుచేయడానికి ధర్మ దేవత కూడా అసమర్థురాలే. పంచములను "కసరి బుసకొట్టు

నిగాలిసోంక నాళ్లు పడగల హైందవ నాగరాజు''. ఈ రకంగా ఒక జాతికి జరిగే అన్యాయాన్ని సమూలంగా పెకలించి వేయాలనే ఉద్దేశంతోటే ఈ చిత్రీకరణ జరిగింది.

అయితే, సమాజంలో ఇటువంటి వ్యవస్థ నెలకొనడానికి హేతువు మూఢ విశ్వాసాలు. అందువలనే ''గబ్బిలము''లో మూఢ విశ్వాసాల పైన కవి ధ్వజం ఎత్తుతాడు. ఈ మూఢ విశ్వాసాలు నశించినప్పుడు సర్వమత సామరస్యం, సర్వ మానవ సమానత్వం ఏర్పడతాయి. సంఘంలో నున్న దురాచారాలన్నీ గబ్బిలానికి అరుంధతీసుతుడు చెప్పుకుంటాడు. ఇవి పరమేశ్వరునికి విన్నవించమని ప్రార్థిస్తాడు.

ప్రతిమలకి పెండ్లి చేయడానికి వందలు వేలు వ్యయిస్తారుగానీ, దుఃఖితులైన పేదల పాత్రలలో మెతుకు విదల్చరు'' ముప్పది మూడు కోట్ల దేవతలెగద్ద దేశమున భాగ్య విహీనుల క్షుత్తులారునే'' అంటూ కవి మనల్ని సూటిగా ప్రశ్నిస్తున్నట్లుంటుంది. ఇక్కడ కవి ప్రతీ సంవత్సరం జరిగే సీతా కళ్యాణాదులను వ్యతిరేకిస్తున్నాడు. ఆ ధనంతో పేదల బాధలు తీర్చమని ప్రబోధిస్తున్నాడు.

ఆ రోజులలోనే తమిళులు, ఆంధ్రులు ఎడముగడ పెడముగంగా ఉండడం, అన్యోన్య తిరస్కారాలు గావించుకుంటూ ఉండడం కద్దు. ఆ గర్హణీయ దశను ఎంత చమత్కారంగా ఎత్తి పొడుస్తున్నాడో చూడండి.

''చంద్ర చండకరులు సన్మార్గగతుల్య నొకని జూచి యొకరు రోర్వజాల రెండు కింత వైర మిరువురిలో ద్రావిడీ డెవండ తెల్గువాడెవండు''.

సూర్య చంద్రులిద్దరూ ఆకాశాన్నే ఆశ్రయించి తిరుగుతున్నా ఒకరంటే ఒకరికి పడదు. ఒకరు రాత్రివస్తే, మరొకరు పగలు వస్తారు. ఎందుకు వీరిద్దరికీ ఇంత వైరం? ఇందులో తమిళుడు ఎవడు? తెలుగు వాడు ఎవరు?

సమాజంలో, ప్రజలను మోసగించి ధనాన్ని దోచేవాళ్ళలో దొంగ సన్యాసులు ప్రసిద్ధులు. వాళ్ళ బారినుంచి ప్రజలను కాపాడడానికి వేమన కాలం నుంచి సాంఘిక చైతన్యంగల కవులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. శుష్క దేహాలతో, కషాయ వస్త్రాలతో, నారకాయ బుర్రలు, జటాజూటం ధరించి తిరిగే మతపు వేషధారుల రూపరేఖావిలాసాల్ని సర్వగర్భంగా అభివర్ణిస్తూ తమ కవితను విశ్వమానవ లోకానికి వినిపిస్తారు.

ఈ విధంగా జాషువా సమాజంలోని విగ్రహారాధన, జంతుబలి, పరమతనింద, మొక్కుబడులు, పిచ్చిపూజలు మొదలైన దురాచారాన్ని తన కవితలలో ఖండిస్తూ సుతిమెత్తగా ఎలుగెత్తి చాటుతాడు.

సమకాలీన సమాజాన్ని చూచి వ్యథ పొందిన కవి, ఒక ఉత్తమ లోకాన్ని ఆశిస్తాడు. అటువంటి లోకాన్ని, సృష్టించుకోమని ప్రజలకు సందేశం అందిస్తాడు. జాషువా ''గబ్బిలము'' కావ్యం ద్వారా తను ఆశించిన సమాజం ఎటువంటిదో స్పష్టంగా చెప్పకపోయినా, గబ్బిలాన్ని అటువంటి సమాజాన్ని ఎక్కడైనా చూసావా? అని ప్రశ్నిస్తాడు. పేదలు

భోజనానికి బాధపడని చోటు, సాంఘి కాచారాలకి ఎవరక జ్ఞానం సంపాదించు కొనే చోటు పరిపాలనకు లొంగిపోక స్వేచ్ఛను అనుభవించే ప్రదేశంలో నివసించాలని ఆశిస్తాను.

గబ్బిలం రచించి ముప్పై ఏడేళ్ళు గడచినా కవి ఆశించిన సమాజం నిర్మాణము జరగకపోగా నూతన సమస్యల ప్రాదుర్భావం కలిగింది. కాని జాషువా కవిత ద్వారా ప్రభావితం అయిన సాంఘిక చైతన్య, అభ్యుదయ కవిత్వం అవిచ్ఛిన్నంగా సాగిపోతోంది.

మృత జీవులు

ఎర్నెస్ట్ హెమింగ్వే

(నాలుగు దశాబ్దాల క్రితం స్పెయిన్లో నియంతృత్వ శక్తుల నెదిరించి పోరాడిన అమరజీవుల సంస్మరణ)

చచ్చిపోయిన వాళ్ళు ఈ వేళ స్పెయిన్‌లో చలిలో నిద్రిస్తారు. చెట్ల మొదళ్ళ దగ్గర పోగుపడుతూ మంచు ఆలివ్ తోపులలో దూసుకు వస్తోంది. తల వల కలుస్తున్న [ఆ పలకలు పెట్టే వ్యవధి వున్న చోటనే] మట్టి దిబ్బలమీదినుంచి మంచు

వసంతంలో భూమిని మృదులం చేస్తూ వర్షం వస్తుంది దక్షిణంనుంచి మారుతం మిట్టల మీదుగా మందం మందంగా వస్తుంది. నల్లని చెట్లు పచ్చని చిగుళ్ళతో తిరిగి ప్రాణం పోసుకుంటాయి. జెరామా నది

గల వ్యవధి యుద్ధకాలంలో వుంది. దానిని గుర్తుంచుకొనే వ్యవధి అనంతంగానూవుంది

స్పెయిన్ దేశపు రైతుల, కార్మికుల హృదయాలలో, మనస్సులలో స్పానిష్ రిపబ్లిక్కు మీద విశ్వాసంతో, దానికోసం పోరాడిన, నిజాయితీగల మంచి నీతిపరులయిన ప్రజలందరి హృదయాలలో, మనస్సులలో మన మరణించినవారంతా జీవిస్తున్నారు. వారు స్పానిష్ మట్టిలో వున్నంత కాలం అక్కడ ఏ దుష్టవ్యవస్థా ఎంతోకాలం వుండదు. ఆ మన్నువున్నంత కాలం వాళ్లూ వుంటారు.

ఇతర దేశాలనుంచి తెచ్చుకొన్న ఆయుధాల బలంతో ఫాసిస్టులు దేశంలో విస్తరించవచ్చు. ద్రోహులూ, పిరికిపందలూ చేసిన సహాయంతో వాళ్ళు పురోగమించవచ్చు పట్టణాలూ, పల్లెలూ ధ్వంసం చేయవచ్చు. ప్రజల్ని బానిసల్ని చేయడానికి ప్రయత్నించవచ్చు. కాని. ఏ ప్రజనీ కూడా బానిసలుగా పట్టివుంచలేరు.

ఇదివరకటిలాగే స్పానిష్ ప్రజ దుర్మార్గాన్ని మళ్ళీ ఎదుర్కొంటారు.

మరణించిన వాళ్ళు మళ్ళీ లేవనక్కర్లేదు. వాళ్ళిప్పుడు భూమిలో కలిసిపోయేరు. భూమిని ఎన్నటికీ ఎవరూ జయించలేరు. దానికి చాలా ఓరిమివుంది. దుష్ట వ్యవస్థని అధిగమించి అది బతగ్గలదు.

దానిలో గౌరవప్రదంగా కలిసిపోయిన వాళ్ళంతా అప్పుడే అమరులయ్యేరు. స్పెయిన్ కోసం చనిపోవడం కన్నా గౌరవంగా మరణించిన వాళ్ళెవ్వరూ లేరు. ●

కన్నీరు

మల్లాది వెంకట
కృష్ణమూర్తి

కాదది వట్టి నీరు
కన్నీరది పన్నీరు
బలహీనతకి మారుపేరు
బాధకి పొంగే ఉప్పునీరు
దాని శక్తి ఎంత ?
బాధలు తరిగేంత
హృదయాలు కరిగేంత
కంఠాలు ఊగేంత
దాని ఖరీదెంత ?
మాడే కడుపంత
మండే గుండెంత
మానవత్వ మంత.

నేను

రాధేయ

నవీన యుగ నిర్మాతను
నవమంత్రపు సిరి విజేతను
ప్రగతి రథ సారథిని
అభ్యుదయకాంక్షా ప్రబోధిని
యజ్ఞవాటిక
నా హృదయ పేటిక
రుధిర ధార
నా ప్రగతి జాడ
ఘర్మ జలం
నా పరిష్కృత ఫలం.

బడి

–మిరియాల రామకృష్ణ

వినిపిస్తుంది
పనగల్గితే
బతుకు పోరాటంలో
వల్లిస్తున్న లెక్కల పాఠం
వీధిలో
రకరకాల
కేకల వెనక !

కథానిక

"ముడుంపు"

మల్లాది వెంకటకృష్ణమూర్తి

దాదాపు ఇరవై నిముషాలనుంచి తనవంకే ఓరగా, ఆశగా, దాదాపు తినేసేలా చూస్తున్న తెల్లచొక్కా అతని వైపు చూసింది వసుమతి. రెండు కళ్ళు తమాషాగా ఆర్పుతున్నాడు.

వసుమతి నవ్వీ నవ్వ నట్లుగా నవ్వింది. అతను వసుమతి ప్రక్కన వచ్చి నిలబడి అద్దాల కేస్‌లోని స్టిల్స్‌ని, మధ్య మధ్యలో దొంగతనంగా వసుమతి పెదవుల్ని, బుగ్గలని, మెడని చూస్తున్నాడు.

వసుమతి అతని మొహంలోకి సూటిగా చూసి నవ్వింది. అతనూ నవ్వాడు.

"సినిమాకి వచ్చారా?" అడిగింది అతనెవరో తెలియక పోయినా.

"అవును మీరు?"

"ఒంటరిగా" అని నవ్వి, "దయచేసి నాకో ఓ డ్రస్ సర్కిల్ టిక్కెట్ తెచ్చి పెట్టండి" అన్నది. హేండ్‌బేగ్ తెరచి అయిదు రూపాయల నోటు అందించబోతుంటే, అది అందుకోకుండా అన్నాడు.

"ఫర్వాలేదు నే తెస్తాను."

"కొంపతీసి మీ డబ్బుతో చూపిస్తారా ఏమిటి?" అడిగింది వసుమతి అతనిలా కళ్ళు ఆర్పకుండగా నవ్వుతూ.

"అవును, అభ్యంతరమా?"

రెండు టిక్కెట్లు తెచ్చి అన్నాడు ఉషారుగా.

"పదండి."

ఇద్దరూ కార్పెట్ పరిచిన మెట్లెక్కి పైకి వెళ్ళారు. తన అదృష్టానికి సంతోష పడుతున్నాడు తెల్ల చొక్కా అతను.

"అలా కూర్చుందామా?" అడిగాడు ఓ మూలగా జనంలేని సీట్లవంక చూస్తూ.

"మీరు అలా కూర్చోండి. నేను ఇలా కూర్చుంటాను. సినిమా చూపిస్తున్నందు థాంక్స్"

అతను తెల్లబోయి చూస్తుంటే వసుమతి హుందాగా ఇద్దరి ముసలి దంపతుల ప్రక్కన కూర్చుంది. వాళ్ళని పలకరించింది. క్షణాలలో కబుర్లు చెప్పుకుంటున్నారు వాళ్ళు.

థియేటర్‌లో చీకట్లో వసుమతిని చాలా చేద్దామనుకుని ఆశపడి టిక్కెట్ కొన్న ఆ తెల్ల చొక్కా అతను వసుమతిని తిట్టుకుంటూ కూర్చున్నాడు దూరంగా.

రాచకొండ విశ్వనాథశాస్త్రి కథా సారస్వతం

సుప్రసిద్ధ కథకుడు, నవలా రచయిత శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనల గురించి మార్చి 6న ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ ఆధ్వర్యాన, మద్రాసులో పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో జరిగిన సమావేశంలో శ్రీ ఈశ్వర్, శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు, శ్రీ చామర్తి దుర్గాప్రసాద్ తమ వ్యాసాలు చదివిన తరవాత జరిగిన చర్చలో పలువురు పాల్గొన్నారు. వ్యాస భాగాలను, చర్చ సమాచారాన్ని సంగ్రహరూపంలో ప్రచురిస్తున్నాము.

శ్రీ ఈశ్వర్

రావి శాస్త్రిగారు ఉత్తమ కథకులలో ఒకరు. ఆయన రచనలలో కనిపించే సామాజిక స్పృహ గురించి ఎవరికీ అభిప్రాయభేదాలు ఉండవలసిన అవసరం లేదు.

ఆయన రచనలపై చర్చ ఎందుకు? 'ప్రతి రచయిత రాసే ప్రతిరచనా అన్ని విధాలా ఉత్తమ స్థాయిలో ఉండాలా?' అంటే-' ఉండటం మంచిది అని మనం చెప్పుకుంటాము. అలా- అంత గొప్పగా లేనంత మాత్రాన ఆ రచనను పూర్తిగా కొట్టి పారవేయవలసిన అవసరం లేదు.

ఇటువంటి చర్చలు విమర్శనా దృష్టితో- మంచిని అవగాహన చేసుకోడానికి దోహదం చేస్తే - వాటి ప్రయోజనం నెరవేరినట్లే!

రావి శాస్త్రిగారు 'పాతదే కథ' అన్న కథ రాశారు. 'ఇది బాకీ కథలు' అన్న కథా సంపుటిలో వుంది. సంగ్రహంగా దానిలో కథ యిది.

అనగనగా ఒక భూకామందుకు ఏడుగురు వ్యాపారి కొడుకులు వుంటారు. వాళ్ళు లాభాల వేటకు వెళ్ళి- ఏడుగురు ఎండు కూలీలను పట్టి తెచ్చారు. వాళ్ళు చేసే బండ చాకిరీలో ఒకడు- ఎండబాధ, రాళ్ళ బరువూ భరించలేక, పనిచేయలేక, కోప్పడిన వ్యాపారి కొడుకులకు సమాధానంకూడా చెప్పలేక చచ్చిపోయాడు.

...."మనం బాగుపడాలంటే కూలివాండ్రు చావనూ చావకూడదు. బతకనూ బతకకూడదు. వారు చస్తే, మనకు ఎట్టి లాభమూ సంపాదించే అవకాశమున్నూ వుండదు గనుక మన లాభములకు కొంత నష్టము కలిగినను వారిని మనము కొంత వరకు కొనవూపిరిలో వుంచవలెను" అని లాభసాటి సందేశం ఇచ్చేడు.

వ్యాపార చోరపుత్రులంతా చేరి 'ఇదే సోషలిజం' అన్నారు అప్పుడు చోర నాయకులు కొందరు కార్మిక నాయకులుగా మారి 'అవునిదే సోషలిజం' అని చరిచి చెప్పారు.

దోపిడీ తత్త్వాన్ని- పరోక్షంలో ప్రతిబింబించిన కథ ఇది.

'కార్మికులు పీడింపబడుతున్నారు. ఆ పీడనలో పరోక్షంగా మధ్యతరగతి వ్యక్తులు చోరకార్మిక నాయకులు' సహాయ

చర్చా వేదిక

పడుతున్నారు- పైవాళ్ళు లాభాలు దోచుకుంటున్నారు. ఇదీ కథ అనడం- ఈ వ్యవస్థ- ఈ స్థితినుంచి మారడానికి అవకాశాలు లేవేమో అన్న నిరాశా భావాన్ని కల్పించడంలేదా? అలాకల్పిస్తే కథా ప్రయోజనం ఎంతవరకు నెరవేరినట్లు? ఈ కథలో పరిధి దోపిడీని ప్రతిబింబించటం వరకే- ఆ తర్వాత ఏంజరగాలన్నది 'ఫోకస్'లోకి తీసుకురావడానికి ఇతివృత్తం పరిమితులు అడ్డువస్తాయని చెప్పి- మనం సమర్థించుకోవచ్చు. ఆ సమర్థన ఎంతవరకు సమంజసం-? ఇదీ చర్చనీయాంశం.

ప్రతి రచనా ఆ ప్రయోజనం ఎంత వరకు నెరవేరింది అన్నది చర్చించడానికి యిటువంటి చర్చలు ఉపయోగపడాలన్న దృష్టితో- ఈ కథను మీ ముందుకు తేవడం జరిగిందే తప్ప-మరో విధంగా రావిశాస్త్రిగారి సాంఘిక నిబద్ధతను శంకించడం ఎంతమాత్రమూ కాదు-

బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు:

మాక్సి గోర్కి ఒక ప్రశ్న వేశారు: "ఓ కళాకారులారా, మీరెవరి పక్షం ఉన్నారు?" అని కళాకారుడు హతుల పక్షం వహించి హంతకుల నిజ స్వరూపాన్ని బట్టబయలు చెయ్యాలా, లేక ప్రజలను చంపుకు తినే హంతకుల పక్షం వహించాలా ప్రతిరచయిత తేల్చుకోవలసి ఉంటుంది.

శాస్త్రి గారి రచనలు చదివిన మీదట ఆయన ఎవరిని చంపి ఎవరికి న్యాయం చేయాలనుకుంటున్నారో స్పష్టమవుతుంది. ఆయన లక్ష్యశుద్ధి ప్రతి రచనలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

మన సమాజంలో మనుషుల్లో ఇంత కర్కశత్వమూ, మోసమూ, ద్వేషమూ, పగా, పశుత్వమూ ఎందుకున్నాయో "తలుపు గొళ్ళెం" కథ చెబుతుంది. కడుపేద వాడైనా పైడ్రాజు పెద్దల్లా దోచుకు తినడం బెస్టు అనే పరమ ఘోరమైన నిశ్చయానికివచ్చి నెమ్మదిగా పట్టుదలగా పని చేస్తాడు. కంట్రాక్టులు చేసి కూలీల కష్టాన్ని దోచుకుని లక్షలు గడించి పైడ్రాజు గారుగా చెలామణీ అవుతాడు. దోచుకుతినడం అనే వ్యవస్థలో మానవత్వం మరుగున పడకతప్పదు.

తమ గతుకుల బతుకు బాటలో అనుక్షణం సతమతమయే నిర్భాగ్యులైన కష్టజీవులు తమ్ము పీడించే వారి మీద తిరగబడి తమకు న్యాయంకోసం పోరాడితేనే వారు మున్ముందు బతగ్గలరనే సందేశాన్ని ఆయన 'అరటి తొక్క' అనే కథలో తెలియ జేశారు.

ఒక్క మాటలో చెప్పాలంటే మన సమాజంలో మానవ ప్రవర్తననూ, అందుకు గల ఆర్థిక సాంఘిక కారణాలనూ పాత్ర పోషణకు భంగం కలగకుండా కథా సంవిధానం ద్వారా పాఠకులకు సుస్పష్టం చేస్తారు రచయిత.

తెలుగు కథానికా చరిత్రలో రావిశాస్త్రి గారు ఒక పోకడకు ఆద్యుడు. ఆయనను చాలమంది యీనాడు అనుసరిస్తూండడమే అందుకు నిదర్శనం.

శ్రీ చామర్తి దుర్గాప్రసాద్

"సారా కథల" ముందు- తర్వాత అని రావి శాస్త్రి గారి కథల్ని విభజించవచ్చు. ముందు దశలో ఆయన మధ్యతరగతి ప్రజల లోపాల్ని, వారి నీతుల్ని సున్నితంగానూ, ద్వేషం లేకుండానూ,

సూటిగా కాకుండా కథ చెప్పే పద్ధతి, లేదా శిల్పం అనే ముసుగు ద్వారా చూపించారు. అర్జంటు పని మీద వెళ్ళవలసి, వాన మూలాన భయపడి తన కోసం అదే వానలో బొగ్గుల కోసం పరుగెత్తిన పిల్లాడి నుంచి, తన బలహీనతను తెలుసుకొన్న మనిషి, తన ఆకలి ఏదో విశిష్టమైనదని భ్రమపడి- తన పిల్లాడి ఆకలి ముఖ్యమైన సమస్యగా అనుకొన్న అన్నాజీరావు లోకంలోని మిగతావాళ్ళ ఆకళ్ళనుగురించి ఆలోచించక పోవడం, గానుగలో ఎద్దులాగ జీవితం ట్రాన్స్ ఫర్లతో గడుపుతూ ఒక క్షణాన గతంలోని పీడలిష్ట చూసుకొన్న గుమస్తా, నీతిగా వుండీ నరకంలో పడిపోతున్న అల్ప జీవుల తెగింపులేని పిరికితనం- ఇవన్నీ ఆయన ఆ దశలో సంయమనంతో ఎంత వరకు చెప్పాలో అంత వరకే చెప్పి పాఠకుణ్ణి ఆలోచింప చేస్తూ ఆలోచనకి కొంత వదులుతూ మాస్టర్ రచయితలా కథల్ని తయారుచేశారు.

వ్యక్తి లోపాలకి కారణం వ్యవస్థ అన్న సత్యాన్ని వెనకాలే వుంచి వ్యక్తుల్నే ముందుకుతెస్తారు ఆ కథల్లో. ఆ వ్యక్తులు మాంసం నెత్తురూ ఉన్న నిజం మనుషల్లాగే కనపడతారు చదివిన వాడికి వ్యక్తిగా మనం మారాలి అని నిరూపించినంతగా వ్యవస్థను మార్చాలి అన్న ఉద్దేశం వెంటనే రాదు. ఆలోచించగానే ఆ దృష్టి కలుగుతుంది అనుకొంటి.

ఇవన్నీ మంచి కథలు, ఉత్తమమయిన కథలు, నిబద్ధత హద్దుల్లోఉంటూ 'రచన' కళగానే విశ్వసించి చేసిన రచనలు. కళ కళ కోసమే అన్న అపనిందకి గురి కాకుండా తలెత్తుకుని ప్రయోజనాన్ని ఆశించిన రచనలు. ప్రయోజనం కోసమే రాసి కళని గాలికి వదిలేసిన కథలూ కావు. కళ, ప్రయోజనం సమపాళ్ళలో రంగరించిన కథలు ఇవి.

సారా కథల తర్వాత ఆయన బడుగు జనం శ్రామికులు కాదు - పెట్టీ క్రైమ్ చేసే నేరస్తులు. ఒక రకంగా పతితులు. వీళ్ళని ఆధారంగా కథలు రాస్తున్నారు. మీ దుస్థితికి ఈ వ్యవస్థే కారణంసుమా' అని నిశ్చయంగా చెప్పడం కోసమై చేస్తున్న రచనలు ఇవి. వ్యవస్థ కథల్లో ప్రధానపాత్ర. దానిముందుమిగతాపాత్రలు ఫోటో ఫ్రేమ్సులాగానూ ఒక్కొక్కప్పుడు కేరికేచర్స్ లాగానూ తయారయినై అని నేననుకుంటున్నాను.

ముసుగుని ఎత్తేసి సూటిగా చెప్పడం వలన కళ స్థాయి తగ్గింది. అయినా ప్రయోజనం దృష్టిలో వుంచుకొని తన్ను

ఎక్కలేని సౌధం

ఉపద్రష్ట సాయి

నేను కట్టిన సౌధం
ఒక తాజమహలు కాకపోవచ్చు-
కేవలం కలల ఇటుక రాళ్ళతో
ఊహల సిమ్మెంటుతో
అనుభవాల పాలరాళ్ళతో
ఆశయాల అద్దాలతో
కష్టాల కడవలతో కన్నీళ్ళు నింపి
అహర్నిశలు కష్టపడి కట్టాను.
అంతా అయ్యాక తెలుసుకొన్నాను
నేను కట్టింది
సోపానాలు లేని సౌధం అని
అందుకే పైకి ఎక్కలేక
అందాలను ఊహించుకొన్నాను.

చదివే జనం ఆలోచించటంలేదని ఆయన అనుకోవడం మూలాన కాబోలు సూటిగా చెప్పే విధానం ఎన్నుకొన్నారు.

ఇంత వరకూ శాస్త్రి గారు ఉత్తమ రచయితే కాకుండా రచయితల రచయిత, కుప్రిన్, డికెన్సు లాగా రచయిత.

ఆ తర్వాత ఆయన కథలు వ్రాయలేదు. నవలలు వ్రాశారు. ఆయన ఎప్పుడూ నవలా రచయిత కాదు. రాసిన నవల కూడా నిర్మాణం దృష్ట్యా కథే. ఎబ్బై పేజీల సంఖ్యలోనే ఉదా. ఈ దశలో ఆయన నిగ్రహం చూపకుండా, రాసింది మరో మారు చూసుకోకుండా కథ పరిమితి, రూపం పట్ల శ్రద్ధగా ఆలోచించకుండానే రాయడం మొదలెట్టి, అచ్చు కిచ్చేయడం- ఏదో ఒక తీరికతో రాసినట్టు రాస్తున్నారు. 'చెప్పడం' ఒక అంతూ, పొంతూ లేకుండా జరుగుతూంది సొద అనిపించేలా రాస్తున్నారు. ఆ కథ రచయిత్వంలాగే ఆయన కథలు కూడా రూప విహీనం కాక తప్పదు.

ప్రతి రచయితలో పునరుక్తి వుంటుంది. సూక్ష్మంగా ఆలోచించి నప్పుడే ఆ పునరుక్తి కనబడాలి గాని, స్థూలదృష్టికి కనపడకూడదు. ఒక రచయిత రాసింది ఆయనే కాదు మరొకడు కూడా రాసి వుండకూడదు. వైవిధ్యం కోసం రచయిత అనంతంగా ప్రయత్నించాలి. అనుభవాలు ప్రోగు చేసుకోవాలి. శాస్త్రి గారి అనుభవాలు అన్నీ పూర్తిగా కొదవ ఉజ్జు... చేస్తున్నాయి. ఆయన శక్తి యుక్తులు రచనాపరంగా వ్యర్థమౌతున్నాయి.

శ్రీ మహీధర రామమోహనరావు చర్చలో పాల్గొంటూ సమాజంలో వచ్చే సంస్కరణలకు ఆర్థిక అవసరాలూ సాంస్కృతిక పరిణామాలూ పూర్వరంగంగా పనిచేస్తాయని చెప్తూ, శ్రీశాస్త్రి గారి "పాతదే కథ"ను ప్రశంసించేరు. ఉద్యమాలలో చేరే వాళ్ళంతా ఉత్తములని గాని, వారి ఆలోచనలూ, పద్ధతులూ ఎప్పుడూ సరిగానే వుంటాయని గాని, ఉద్యమాలెప్పుడూ తిన్నగా, ఎప్పుడూ ముందుకే నడుస్తాయని గాని అనుకోవడం భ్రమ. ఒడిదుడుకులూ ఎదురవుతాయి. ఈ వ్యతిరేక, నష్టకర ఘటనల్ని వెలుగులోకి తెచ్చి చూపించడం ఉద్యమాలకి నష్టం. శ్రీ శాస్త్రిగారు "పాతదే కథ"లో కారణ రహితంగా నాయకత్వాన్ని నిందించారు. వారిదే "వేతన శర్మ" కథలోనూ ఇటువంటి అంశాలే వున్నాయి.

శ్రీ డి. వి. నరసరాజు చెదురు ముదురు ఘటనలను సామాన్యీకరిస్తే వచ్చే తంటాలని అన్నారు.

శ్రీ దుర్గాప్రసాద్ ఉద్యమాలలో వచ్చే లోపాలను విమర్శించే సాహిత్య రచనలకు తావుండాలి. పాస్టర్నాక్, సోల్జినిత్సిన్ల రచనలు అద్భుతమైనవి. అవి ముందే వచ్చివుంటే సోవియట్ సమాజానికి ఎంతో మేలు జరిగివుండేది. ఈ దేశాలలో ప్రభుత్వ విధానాలను ఖండించే రచనలు వచ్చి వుండకపోతే మెక్కార్థీయిజం ఇంకా భయంకరంగా సాగి వుండేది. ఇప్పుడున్న రాజకీయ పార్టీలన్నీ లోపాల్ని దాచేసి దగా చేస్తున్నాయి.

శ్రీ సూర్యారావు సోవియట్ రచయితలు ఏనాడూ సత్యాన్ని దాచలేదని చెప్తూ మయకోవస్కీ 'బెడ్ బగ్' నాటకాన్ని, ఇలా ఎహ్రెన్‌బర్గ్ "థా" నవలను వుదాహరించేరు.

మహీధర: లోపాల్ని చూపడం తప్పుకాదు. అవసరం కూడా. అయితే లోపమే తప్ప ఉద్యమంలో ఏమీ లేదని చూపడం తప్పు.

ఈశ్వరరావు: ఉద్యమంలో కొన్ని చెడుగులూ జరగవచ్చు చిన్న ఘటనలను చూపినిందలు కురిపించడం మంచిదికాదు. కాకినాడ కాంగ్రెస్ మహాసభలో వాలెంటీర్ల లైంగిక కార్యకలాపాల్ని చలం ఒక కథలో చిత్రించారు 1921 లో చంపారన్ వుద్యమంలో పోలీసు ల్ని సజీవదహనం చేశారు. ఒక మహోద్యమంలో అదొక చెదురుమదురు ఘటన. దానిని చూసి అసలు వుద్యమమే తప్పన రాదు. శ్రీ శాస్త్రి "పిపీలికం" చాల మంచి కథ, కాని "వేతన శర్మ" రచనా పద్ధతి హర్షించ తగిందిగా లేదు. చాలీ చాలని వేతనాలతో సతమతమయ్యే గుమస్తాలను తూలనాడడం వల్ల.

శ్రీ శ్రీకాంత్ ఎన్. జి వోల సమ్మె 56 రోజులుగా సాగుతూ, తీవ్రస్థాయికి చేరి వున్న దశలో నాయకత్వం మీద అవిశ్వాసం కలిగించే రీతిగా "వేతన శర్మ" వచ్చింది.

శ్రీ వి. చెంచయ్య:, ఒకరచయితను గురించి చెప్పేటప్పుడు ఆయన మొత్తం రచనలను గమనికలోకి తీసుకోవాలి. ఒకటీ, అరా చూస్తే తప్పుదారి పడతాం.

శ్రీ డి. వి. నరసరాజు; ఉద్యమం లోని ఒక లోపాన్ని ఆ వుద్యమానికే హానికరంగా చిత్రించడం జరిగినప్పుడు విమర్శించడం, రచయితనే ఖండించి నట్లు కాదు రచయిత పరివర్తన దశలను చూపడం రచయితకూ, పాఠకులకూ కూడ ఉపయోగకరం.

శ్రీ ఈశ్వరరావు ఆ విషయాన్ని బల పరుస్తూ శ్రీ శాస్త్రి విశాఖ మండలంలోని ఒక విభాగం వారిని తీసుకుని చాల అంద మైన 'పెన్ పిక్చర్స్' గీసేరు. ఆయన ప్రతిభనెవ్వరూ కాదనరు. కాని ఆయన రచనలలోనికొన్నిసవ్యంకానిపోకడలను చూపడం అవసరమన్నారు.

రచయితలకు జాక్ లండన్ సలహా

("ది ఫిలాసఫీ ఆఫ్ ది రోడ్" రచయితకు జాక్ లండన్ ఇచ్చిన సలహా రచయితలంతా గమనించపలసినది)

మీరు ఉరకలెత్తుతున్న జీవితాన్ని, మానసికోద్వేగాల్ని, మానవ జీవిత విష యాల్ని, హాస్యాన్ని, భావ శబలతను చిత్రిస్తున్నారు. కాని, స్వామీ, వానిని సముచితంగా చిత్రించండి, పథికుని మన స్తత్వాం గురించి మీరు పాఠకుడికేమీ చెప్పకండి. మీ పాత్రలే చెప్పవలసిన దేదో తమ చర్యలద్వారా, కవళికల ద్వారా, మాటలద్వారా చెప్తాయి. స్టీవె న్సన్‌నూ, కిప్లింగ్‌నూ జాగ్రత్తగా చదువు. వారు తాము కనబడకుండా దాగుతారు. ఊపిరి తీసుకుంటూ సజీవంగా వుండి, మనుష్యుల్ని పట్టేసి, ఎంత రాత్రయినా దీపంఆర్పనివ్వనికావ్యసృష్టిచేస్తారు ... వుల్నితయారు చేస్తారు. వాతావరణం అనేది ఎప్పుడూ కళాకారుణ్ణి దాచెయ్యడానికే. స్వచ్ఛమూ, స్పష్టమూనైన మంచి బలమైన పదబం ధాలను తీసుకోండి. వ్రాతలో చిక్కదనం చూపాలి. కావలసింది విస్తృతీ కాదు. దైర్ఘ్యమూ కాదు. చెప్పుకు పోవద్దు, చిత్రించు. 'బొమ్మగీయి' కట్టుకుపో; సృష్టించు; అతి సామాన్యంగా, సాగదీసి హడావిడిగా వ్రాసి పారేసిన ఓ పెద్ద పుస్తకంకన్న జాగ్రత్తగా కూర్చిపేర్చిన ఓ వెయ్యి పదాలు చాలు. నిన్ను నువ్వు మరిచిపో; అప్పుడు ప్రపంచం నిన్ను జ్ఞాపకం వుంచుకుంటుంది.

కథానిక

కొమరుడు

ఘస్సన్ కనఫనీ

మధ్య ప్రాచ్యంలో యూదు దురహంకార వాదం అరబ్ భూభాగాలను ఆక్రమించుకొని పాలస్తీనాకు చెందిన అరబ్ ప్రభువుల స్వయ నిర్ణయాధికారాన్ని, మాతృభూమికి తిరిగిరావడానికి వారికిగల హక్కును నిరాకరించింది. ఇప్పటికీ ఆ ప్రజలలో కొందరు స్వదేశానికి దూరం చెయ్యబడి అష్టకష్టాలు పడుతున్నారు. అటువంటివారిలో పాలస్తీనా ప్రసిద్ధ రచయిత ఘస్సన్ కనఫనీ ఒకరు.

శీఘ్రగ్రాహి, మృదుల హృదయుడు అయిన ఆ రచయిత తనకు కలిగిన ఒకే ఒక్క కొడుకు పుట్టిన కొన్ని గంటల తరువాత, ఈ తొలి రచనను చేశారు. తరువాతది ఆ బిడ్డ, ఆ బిడ్డలాగే "నిర్వాసుయిసున" పాలస్తీనా బాలల ప్రతిపత్తిని గురించి ఆయన చేసిన వ్యాఖ్య.

మనుష్యులు భుజాల మీది బరువు

అర్ధరాత్రికి గంటన్నర ముందర, ఫయిజ్ పుట్టాడు. అందుకు నాకుఅభినందనలు చెప్పడానికి దాది వచ్చినప్పుడే, ఫయిజ్ నా భుజాలమీద పెద్ద బరువులా పడడం నేను గమనించాను. కొద్దిసేపు తల తిరిగినట్టయింది. భిన్న భిన్నమైన అనుభూతులు, ఆలోచనల సందడిలోనే నా కాలి కింది నేలకు నేను కట్టివెయ్యబడ్డట్టయింది. అసలు ఆ బరువు నా భుజాలమీద పడడంతోటే యీ భూమిలో నేను మరికాస్త లోతుకు కూరుకొని పొయ్యాను.

ఉదయం ఆ బిడ్డను చేతుల కెత్తుకొని వచ్చి దాది నాకు చూపించింది. ఏదో బుద్ధిహీనమైన ఎర్రటి మాంసపు ముద్దలా కనిపించాడు: కళ్ళు మూసుకొని, నోరు తెరచుకుని ఉన్నాడు. అరచేతులు వొణుకుతున్నాయి. ఆ కళ్ళు చూడవలసినది ఎంతో వున్నది, నోరు నమిలి నెమరువేసుకొనవలసినది ఎంతో ఉంది. ఆ అరచేతులు దేనికి- ఇవ్వటానికా, పుచ్చుకొనటానికా, లేక ఇచ్చి పుచ్చుకొనటానికా?

నా పక్కనే నిల్చుని వున్న డాక్టరు అడిగారు "మీ కేమనిపిస్తున్నది?" అని.

"నా కేమనిపించడం లేదు...."

"ఏమీ అనిపించడం లేదా?"

"ఏమీ అనిపించడం లేదు...."

అప్పుడు నాకు నేను ఇట్లా చెప్పుకొన్నట్టుంది: లక్షోపలక్షల అనుభవాలకు, కోపానికి, సంతోషానికి, ఆశ్చర్యానికి, నిరాశకు, సౌఖ్యానికి, దుఃఖానికి, నవ్వడానికి, ఏడవడానికి ప్రేమకు, ద్వేషానికి, నిరీక్షణకు, చికాకుకూ ఒక సమయం అనేది వుంది. లక్షోపలక్షల క్షణాలు విరుద్ధ ప్రవృత్తులన్నవి ఎన్నో యీ భూమిమీద కొల్లగా వున్నాయి.

ఇంకొక గదిలో వాడి తల్లి పక్కమీద పండుకొని వుంది. బిడ్డను కనడానికి ఆమె పడిన నొప్పులన్నిటినీ బుగ్గలమీద ఓడికలు కట్టిన కన్నీటి తడి ఆరక ముందరే పూర్తిగా మరచిపోయింది. ఇంతకు ముందరి రోజు నొప్పికి తట్టుకోలేక దాదాపు రోజు రోజంతా మూలిగింది.... దాని నంతటినీ ఆమె ఇందుకోసమే, ఈ ప్రేమకోసమేనన్నట్లు మరచిపోయింది. "నీకు మగ శిశువు కలిగాడమ్మా" అని ఎవరో అన్నప్పుడు ఆ మాతృహృదయం పొంగి పరవళ్ళు తొక్కింది. ఒక తల్లికి తప్ప ఆ కడుపు తీపి గొగ్రాలికి, ఇంకొక

మానవ మాత్రుడికి అనుభూత మయ్యేది కాదు కూడా. ఆ మాతృప్రేమ ఒక కవి కల్పిత హస్తంతో ప్రతి ఒక్క దానినీ కడిగి వేసింది.

దాని చేతులలో ఉన్నాడు పసివాడు. బిడ్డపక్కనే ఉన్న నా దగ్గరకు నాతో పాటు బిడ్డను తనూ చూడటానికి రాలేని పరిస్థితిలో ఆమె మంచంమీద పడుకొనే ఉంది. ప్రేమా, ఒక విధమైన భయమూ పన్నా శాసనం చేసినట్లు ఒక స్వచ్ఛమయిన గాజు బొమ్మలా అట్లాగే నిల్చుని ఉన్నాను. ఇప్పుడు నా ఆలోచనలు, ప్రయోజనాలు అభావమై ఒక విధంగా కదలినలేని కదలికలా ఉన్నాయి. నా ముందర ఒక మనిషి, తక్కిన తనలాంటి లక్షోపలక్షలమందిలాగే తన భవిష్యత్తు యథార్థాన్ని ఎరుగని వాడు ఉన్నాడు. ఈ కసికందు ఏం చెయ్యగలడు? తెలియని అశక్తుడు. తనను ఆవరించివున్న దానికి దేనికో ముఖాముఖిగా ఉన్నాడు.

పిల్లవాడిని తీసుకొనిపోయి దాది తొట్టెలో వేసి నిద్రపుచ్చాక, నేను నా భార్య గదివైపు నడిచేసరికి నా అడుగుల చప్పుడు విని తిరిగి నా వలయంలోకి ప్రవేశించినట్లయింది. నిజమైన ప్రేమ అనబడేది ఏదో యీ ప్రపంచాన్ని చుట్టుకొని ఉన్నది ఇది నిబద్ధమైనది కాదు' దీనికి ఒక శిక్ష లేదు, ప్రేమ కోసమే యీ ప్రేమ-పరిహారాన్ని లేక ప్రతిఫలాన్ని కోరనిది. దీనికి ఒక ప్రత్యామ్నాయం, ఒక మూల్యం లేక దేని కోసమో అది భయపడడం అన్న వేవీ లేవు-నిశ్చలమైన ప్రేమయిది. ఇంతకు మునుపు ఎన్నడూ - ఎన్నడూ నేను చవిచూడనిది? నాకు కలిగిన ఆ బిడ్డ కోసం, నాకోసమని నాలోనుంచి రెమ్మలా పుట్టుకొచ్చి, కొమ్మలా సాగుతున్నది. నాకు ఆమెపట్ల, ఆమెకు నాపట్ల గల ప్రేమ - వెరసి యీ బిడ్డ మూల్యం అనవచ్చు.

నాకు విచారం అంటే ఏమిటో తెలుసు ఆ మాత గదిని విడిచి ఇవతలికి వస్తూంటే మనుష్యుల భుజాలు మీది బరువు అన్నది లోపలినుంచి, అడుగుల నుంచి పెల్లుబుకుతూ వచ్చేదన్నది నాకు అకళింపయింది. జీవితానికి ఒక ఉదాత్తమయిన ప్రేరణను, ఒక గమనాన్ని, వికాసాన్ని యిచ్చేది అదే. అంతరంగ భారమంటే ఏమిటో అర్థం చేసుకొనని వ్యక్తికి కూడా కనువిప్పు చేసే కలక........!

బిడ్డ తెలిసికొనగోరేది—మానవుడి విధి ???

నా బిడ్డా, ఓ భవిష్యత్తు!

పక్కగదిలో నీ అమ్మను, అమ్మా, నేను పాలసీనా వాణ్నేనా అని నువ్వు అడగడం విన్నాను, ఆమె "అవును" అని సమాధానం చెప్పినప్పుడు ఆ ఇంటి మీదనే ఒక నిశ్శబ్దత పిడుగులా పడ్డది. ఆ దెబ్బతో మా తలకు ప్రేలాడుతూ వచ్చినదేదో కిందపడ్డట్టయింది, ప్రేలుడు చప్పుడది నిశ్శబ్దత.

ఆ తరువాత నా చెవులను నేను నమ్మలేక పొయ్యాను, నా వ్రేళ్ళనే నమ్ముకొన్నాను అప్పుడు నేను చదువుతున్న పుస్తకం నా వ్రేళ్ళ మధ్య వాలుతున్నది. ప్రతిదీ నా కళ్ళకు బొమ్మ కట్టినట్టు అయింది. ఒక భయం లాంటి దిగులు పుట్టింది. నువ్వు ఏడుస్తున్నావు.

ఇంక నేను కదలలేక పొయ్యాను.

నాకు తెలిసిన దాన్ని మించినదేదో అవతలి గదిలో అప్పుడే అవతరించినట్టు, దిక్కుల తబ్బిబ్బు చేసిన నీ ఏడుపు ద్వారా నేను గ్రహించాను. నీ బొడ్డును కోసిన కత్తి నీ వక్షాన్ని చీల్చి, నీ హృదయాన్ని అందులో అమర్చింది.

నువ్వడిగిన ప్రశ్న ఆ ఇంటిలో కప్పుచుట్టూ చుట్టలు తిరిగి, కంపిస్తున్న నా వ్రేళ్ళమీద ప్రతిధ్వనించింది: "నేను పాలెస్తీనియన్నేనా?" అని. ఒక శస్త్ర వైద్యుని కత్తిలా సర్రున కోతపెట్టింది. "అవును," ఒక పెద్ద విరిగి పడ్డట్టు, ఏదో జరిగినట్టు ఆ నిశ్శబ్దత తటాలుమని కింద పడ్డది. నువ్వు ఉగ్గపెట్టి ఏడుస్తున్నావు.

అవతలి గదిలో ఏమిజరుగుతున్నదో చూద్దామన్నా నేను కదలలేని పరిస్థితి. అయినా నాకు తెలుసు దూరాన ఉన్న మాతృభూమి పునర్జన్మ ఎత్తుతున్నదని, పర్వతాలు మైదానాలు, పాలస్తీనా తోపులు, మృతులు, చిరిగిన జండాలు, మడచివున్న పతాకాలు —— ఇవన్నీ ఒక రక్తమాంసాల ముద్ద భవిష్యత్తులోనికి చొచ్చుకొని వచ్చి, ఇంకొక బిడ్డగుండెల్లో చోటు చేసుకుంటున్నాయి.

అయిదేళ్ళ క్రిందట నువ్వు పుట్టినప్పుడు నాకు కలిగిన ఆవేశం నన్ను తన చేతులలోకి తీసుకొన్నది. నేను ఇంకా నీ కోసం అక్కడే వేచిఉన్నాను. ఈ భూమిమీదకి రోదిస్తూ వస్తూ నువ్వు నా భుజాలమీద పడ్డావు, నేను ఈనేలలో మరింత పాతుకొని పొయ్యాను.

పలాయనమై కార్లో అవమానకరమైన ఈ గమ్యాన్ని చేరుకొన్నప్పుడు, నాకు పన్నెండేళ్ళు. అమాయకపు బాల్యపు బండమీద జారడం తప్ప నా కేమీ తెలియదు. అయినప్పటికి ఒక ఘట్టంలో అగ్ని పరీక్షకు లోనయ్యాడు. – అది ఎన్నటికీ మరపుకురానిది. కార్లన్నీ ఒక చోట ఆగిపొయ్యాయి హఠాత్తుగా. పిల్లతనపు ఒక విచిత్ర ప్రేరణతో కారు దిగి మానవుడి విధి అనే దాని మీద కాలు మోపాను. అక్కడ సైనికులందరూ నిల్చొనిఉన్నారు. శరణార్థుల ప్రపంచంలో ప్రవేశం కొరకు తమ ఆయుధాలను వాళ్ళు సరిహద్దు కావలి వాళ్ళకు అప్పగించి వట్టి చేతులతో నడిచారు.

చిన్నబోయి ఏమీ తోచక తలవంచుకొని వెనుకడుగు వేశాను, తక్కిన ఆడవాళ్ళతో పాటు కూర్చొని వున్న మా అమ్మతట్టు చూస్తూ. ఆమె కూడా ఒక శరణార్థే ననుకొని, "ఏం....ఏం జరిగింది?" అని ఆమె నన్నడిగింది. "వాళ్ళ ఆయుధాలను అప్పగిస్తున్నారు లొంగిపోయి" అని నేను చెప్పాను. "అవును" అని నీకు మీ అమ్మ చెప్పినట్టే మా అమ్మ నా కప్పుడు చెప్పింది. "అవును" ఏదో ఫెళ్ళున విరుచుకొని పడ్డట్టు అంతా నిశ్శబ్దమైంది. భయపడి చూస్తున్న మా అమ్మను చాటుచేసుకొని నేను ఏడ్చాను.

పునర్జన్మ ఎత్తినట్టయింది మనుష్యుల వంక, ఇంతకు ముందు వాళ్ళు ఎన్నడూ చూడని విధంగా చూడ మొదలుపెట్టాను. ఆమె కూడా నన్ను వింతగా చూచింది.

మనిషి క్రమంగా ఎదుగుతాడనేది నమ్మవద్దు. కాదు. ఒక్క క్షణంలో పుడతాడు, ఒక్క మాట అతని గుండెల్లోకి దూసుకొని పోయి నాడి కొట్టుకొనడం ఎక్కువవుతుంది. ఒక్క ఘటన చాలు బాల్యపు కప్పు మీదనుంచి అతన్ని మెరక పల్లాల బాట మీదికి విసరి వెయ్య దానికి.

కథకాదు - అనుభవం

మహీధర రామశాస్త్రి

వలువలు - విలువలు

ఓ పెద్దమనిషి రైల్వేస్టేషన్‌కి వెళ్ళాడు, తన బాస్‌కి "గీతాంజలి"లో టికెట్ బుక్ చేద్దామని. రిక్విజిషన్ ఫాం నింపి, రిజర్వేషన్ నెంబరు తీసుకుని పక్క లైనులోకి టికెట్ కొనడానికి వెడుతూంటే, మరో పెద్దమనిషి వచ్చాడు. ఆ వచ్చిన పెద్దమనిషి చాలా నీటుగ, ట్రిమ్‌గ, టిప్‌టాప్‌గ వున్నాడు. పైర్ల కంపెనీ రిప్రజెంటేటివ్‌లా, రాజకుమారుడులా కనిపిస్తున్న అతని చేతిలో ఖరీదయిన బ్రీఫ్‌కేస్ వుంది.

దగ్గరగవచ్చి, "ఏర్ యూ ప్లీజ్ గివ్ యువర్ బాల్ పెన్?" అని అడిగాడు. ఇందాకటి పెద్దమనిషి తక్షణం బాల్ పెన్ అతని చేతికిచ్చి, టికెట్ కొనడంలో మునిగిపోయాడు.

పది నిముషాలయాక, రాజకుమారుడు వచ్చి బాల్‌పెన్ తిరిగి యిచ్చేస్తూ, "థాంక్స్" చెప్పి, ఓ చిరునవ్వు విసిరి విస విస నడుచుకుంటూ వెళ్ళి బయట వున్న "వెస్పా" స్టార్ట్ చేసి అందంగ వెళ్ళిపోయాడు.

టికెట్ కొనడం అయి. టికెట్, బాలెపెన్ భద్రంగ దాచి తిన్నగ బ్యాంకులోకి వెళ్ళాడు. బ్యాంకులో సంతకం చేయడంకోసం బాల్‌పెన్ తీసి రాయబోతే ఎంతకీ రాయలేదు. "ఎంత నొక్కినా, పాయింట్ యివతలకి రాదేమా?" అని ఆలోచించి, విప్పిచూస్తే - ఖరీదయిన విల్సన్ రీఫిల్ మాయం అయింది. రాజకుమారుడు గుర్తుకువచ్చి. అతని హస్తలాఘవాన్ని, శ్లాఘించి వూరుకున్నాడు.

దీన్నేమంటారు?

దొంగతనమా? కాదు! అందమైన వంచన, అంతే!

"వలువలు-విలువలు" అని ఓ కథ రాయొచ్చు రచయిత ఎవరయినా.

జైలు గీతం

ఫయిజ్ అహ్మద్ ఫయిజ్

(ప్రసిద్ధ పాకిస్తాన్ కవి.)

నా సంపద - కాగితం కలం
వాళ్ళు లాక్కుపోయినా విచారించను
గుండె నెత్తుర్లో వేళ్ళుముంచి రాస్తాను;

నా పెదాలు బంధించినా లక్ష్యపెట్టను
గొలుసు ప్రతి కొక్కెంలో
నాలుకొకటి పెడతాను.

నేటి సాహిత్యంలో విలువలు తగ్గుతున్నవా ?

కా కి నా డ
'సాహిత్యలహరి' గోష్ఠి

'సాహిత్య లహరి' ఆధ్వర్యాన కాకినాడలో జనవరి 29 న "నేటి సాహిత్యంలో విలువలు తగ్గుతున్నవా?" అన్న విషయం పైన శ్రీ భమిడిపాటి జగన్నాధరావు అధ్యక్షతను జరిగిన గోష్ఠిలో పలువురు ప్రసంగించారు. ఆ ప్రసంగాల సారాంశాన్ని ఈ దిగువ ఇస్తున్నాము. (సంపాదకుడు.)

శ్రీ ఇస్మాయిల్ : సాహిత్యంలో విలువలు తగ్గిన సమయానికి, హెచ్చిన సమయానికి కొలబద్ద లేదు. కాలాన్నిబట్టి మారుతూ వుంటాయి.

డాక్టర్ శ్రీమతి ఎ. విజయలక్ష్మి : సాహిత్యపు విలువల్ని ఇతివృత్తం, పాత్రపోషణ, భాష, శైలి మొదలైన పడికట్టు రాళ్ళతో ఖచ్చితంగా తూయడం కంటే మారుతున్న సాంఘిక విలువలు, వ్యక్తి భౌతిక, మానసిక విలువలు, మారుతున్న పాఠకుల పఠనాభిరుచి అన్నవి కూడ పరిగణనలోకి తీసుకోవాలి. సృష్టించబడుతున్న మొత్తం సాహిత్యంలో ఉన్నత సాహిత్య విలువలున్న మంచి సాహిత్యం పాలు ఎంత అని లెక్కకడితే, నిస్సందేహంగా నిన్నటికి, నేటికి సాహిత్య విలువలు తగ్గాయనే చెప్పొచ్చు. ఎందుకంటే సాహిత్యంలో 'రాసి' పెరిగినంత ఎక్కువగా వాసి పెరగలేదు. కాని గతంలో వచ్చిన మంచి సాహిత్యాన్ని నేటి మంచి సాహిత్యంతో పోలిస్తే తప్పకుండా నేటి సాహిత్యంలో విలువ పెరిగిందనే చెప్పాలి. గత సాహిత్యంలో యిప్పటిదాక మిగిలి వున్నవి ఆనాటి మంచి రచనలే. ఆనాటి మంచి రచనల్ని యీనాటి మొత్తం సాహిత్యంతో పోల్చుకుని గత వైభవాన్ని చూచి మురిసిపోతూ, వర్తమాన సాహిత్యాన్ని యీసడించడం తగదు. ఈనాడు వస్తున్న సమగ్రమైన, వినూత్నమైన, సామాజిక స్పృహగల రచనలు [illegible] లేవు.

కుమారి వి. వీరలక్ష్మీదేవి : విలువలు తగ్గితే సాహిత్యమే కాదంటూ, ఆవిడ తన కనుభవమైన ఒక కవితను, కథను గురించి ప్రస్తావించి మంచిచెడులను నిరూపిస్తూ, మంచిదైతేనే సాహిత్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

శ్రీ లక్కరాజు జానకి రామారావు:- అచ్చయినదంతా సాహిత్యమే అవుతుంది. కవి అన్నవాడు రచన ఎందుకు చేస్తాడు అన్న ప్రశ్న వేస్తే ఇలా వ్రాయాలి, ఇందుకు వ్రాస్తాడు అని చెప్పకూడదు. సాహిత్యం బుద్ధికి సంబంధించినది. కవికి విశాల హృదయం వుండాలన్నారు. సాహిత్యం ఆనంద ప్రధానమైంది ఎవరికేదినచ్చుతుందో వారది చదువుతారు దానికి మనం అడ్డు తగలకూడదు. సాహిత్యానికొక ప్రయోజనం ఉండాలనుకోవటం మంచిది కాదు.

శ్రీ అద్దేపల్లి రామమోహనరావు:- విజయలక్ష్మిగారి సిద్ధాంతాన్ని నేనెప్పటినుండో నమ్ముతున్నాను. సాహిత్యాన్ని వ్యాపారంగా మార్చుకొంటున్నయుగంలో బ్రతుకుతున్నాం కనుక, కొంత చెడు కూడ వస్తుంది. ఇప్పుడు పూర్వంకన్నా

ఉత్తమ రచనలు వస్తున్నాయి. కవిత్వం అర్థం కావటం లేదు. అన్నీ తెలిసే పదాలే వున్నా, భావం తెలియటం లేదు అనే అభిప్రాయంతో నేనేకీభవించను, "ఫోర్కులతో గడియారాన్ని తినేస్తూ నేనాకాశంలో విహరిస్తున్నాను" అన్న మాట ప్రాచీనుల కర్థం కాదు. దీనికి కారణం వారి 'ఐడియాలజీ' వేరవటం—ప్రాథమిక దృష్టి మారకపోవచ్చు. కాళిదాసు చెప్పిన శ్లోక చతుష్టయం ఆ నాటి తల్లిదండ్రులకు బాధను కలిగిస్తే యీనాటి వారికుండకపోవచ్చు. కాని "రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్" అన్నది మాత్రం శాశ్వతం కావచ్చు. ఎందుకంటే లోతైన భావాన్ని వ్యక్తం చేశాడు కనుక.

డా॥ కుమారి సి. కె. అనార్కలి:- ప్రాచీన కాలానికది విలువ. నేటి కాలానికిది విలువ. అన్నం అకలి నేటి సమాజ సమస్యలు. నాటి వారికివి నచ్చకపోవచ్చు. తరవాత ముందు మాటాడిన వారి మాటల్ని వివరించారు. కృష్ణశాస్త్రి గారి కొన్ని గేయాలలో ఆత్మనివేదనమే కాదు, సాహిత్యపు విలువలున్నాయన్నారు.

డా॥ కె. ఎస్. కామేశ్వరరావు:- సమాజం అతి వేగంగా సాగుతున్న యాంత్రిక దృష్టి కలది. అందువల్ల దృష్టి మారుతుంది. పారిశ్రామికంగా పెరుగుతున్న యుగం అదే అభిప్రాయాల్ని వ్యక్తీకరిస్తోంది. ఈ నాటి రచయితలలో ఉత్తుత్త సానుభూతి మాత్రమే ఉంది. నిజమైన ఆవేశం లేదని అనిపిస్తోంది. పత్రికలకు వ్యాపార దృష్టి ముఖ్యమై పోవటం కూడ దీనికి కారణం. రచయిత ఎయిర్ కండిషన్డు గదిలో వ్రాస్తున్నాడు, పాఠకుడు అలాగే చదువుతున్నాడు. వీళ్ళ వల్ల సమాజం ప్రభావితం కావటం లేదు.

శ్రీ ఆర్. యస్. దీక్షితులు:- ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాసం కవికి ముఖ్యమన్న ప్రాచీనుల వాక్యాన్ని సంస్మరించాలి. ఆ రోజులలో కథకు ప్రాధాన్యం లేదు. నేడు పెరిగింది. భవభూతి కావ్యాలలో కూడ అన్నీ గొప్పవి కాలేకపోయాయి. "గద్ద ఎద్దుకన్నా చిన్నదైనా దాని మాంసాన్ని తింటుంది" అన్న ఆధునిక గేయాన్ని వివరించి అందులో భావనాబలిమి ఎలా లోపించిందో చెప్పారు.

సవరణ

'అభ్యుదయ' మార్చి' 78 సంచిక 31వ పుట శీర్షికను "రేపటి నవల గురించి నేటి సమాలోచన"గా చదువుకోవాలి. (సం.)

చందాదారులకు మనవి

మీరు ఇదివరలో చెల్లించిన చందా కాలానికి సరిపడా ఎంతవరకు మీకు పత్రిక పంపబడుతుందో తెలియజేస్తూ మీకు చందా నెంబరు కేటాయించాము. మీ చిరునామా పైనే ఉన్న మీ చందా నెంబరును మీరు గమనించే ఉంటారు. దానిలో చివరి భాగం, ఏ సంవత్సరంలో, ఏ నెలతో మీ చందా ముగుస్తుందో తెలియజేస్తుంది. దాని ప్రకారం మీ చందాను తిరిగి పొడిగించవలసినదిగా కోరుతున్నాము.

మీ చందా పైకం పంపేటప్పుడు, మీ చందా నెంబరు తెలియజేసినట్లయితే, చందాల పట్టికలో, మీ చిరునామాను వెంటనే సవరించి, మీ చందా కాలాన్ని పొడిగించేందుకు వీలువుంటుంది. మీరు మాతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలన్నిటిలోనూ మీ చందా నెంబరు పేర్కొనవలసినదిగా కోరుతున్నాము.

వార్తా సంగ్రహం

నేదునూరి గంగాధరం స్మారకసభ

అంతరించి పోతున్న ఆంధ్ర జానపద వాఙ్మయ సేకరణకు ప్రచురణకు ప్రాముఖ్యానికి తన యావజ్జీవితాన్ని వెచ్చించిన శ్రీ కీర్తిశేషుడు నేదునూరి గంగాధరం ఎనిమిదవ వర్ధంతి మార్చి 11న రాజమండ్రిలో శ్రీ సహదేవసూర్యప్రకాశరావు అధ్యక్షతను జరిగింది. నేదునూరి గంగాధరం స్మారక మందిరం నిర్మాణం జరగాలనీ, ఆయన కృషిని ఇంగ్లీషు మొదలైన భాషలలో ప్రచురించాలనీ పలువురు వ్యక్తులు కోరారు. ఆయన చేసిన అపార సేవను ప్రశంసించారు.

'త్రివేణి' స్వర్ణోత్సవం

భారత దేశ సాంస్కృతిక పునరుజ్జీవనం, జాతీయ సమైక్యత లక్ష్యంగా పెట్టుకొని శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావు స్థాపించిన 'త్రివేణి' పత్రిక స్వర్ణోత్సవం మద్రాసులో మార్చి 5న శ్రీమతి రుక్మిణీ అరండేల్ అధ్యక్షతను జరిగింది. భారతీయ సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన శ్రీ రామకోటేశ్వరరావు సేవలను అనేకులు ప్రస్తుతించారు. 50 సంవత్సరాలుగా వెలువడుతున్న "త్రివేణి" పత్రికను శ్రీ కె. చంద్రశేఖరన్ వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ అధ్యక్షుడు శ్రీ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్, కర్ణాటక హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయాధిపతి శ్రీ వాసుదేవరావు, "త్రివేణి" ప్రస్తుత సంపాదకులు శ్రీ భావరాజు నరసింహారావు, శ్రీ రామకోటేశ్వరరావు గుణగణాలను వివరించారు.

కుందుర్తికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి

హైదరాబాదులో యిటీవల జరిగిన కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి ప్రదానోత్సవంలో బహూకరించబడిన వారిలో ప్రముఖ తెలుగు అభ్యుదయ కవి కుందుర్తి ఆంజనేయులు ఉన్నారు. అధ్యక్షత వహించిన కేంద్ర అకాడెమీ అధ్యక్షుడు శ్రీ ఉమాశంకర్ జోషి వివిధ భారతీయ భాషల్లోని ఉత్తమ సాహిత్యాన్ని హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదించి, తద్వారా దానిని యితర భారతీయ భాషల్లోకి అనువదింపజేయవలసిన అవశ్యకత వున్నదనీ, జాతీయ సమైక్యతకు సాహిత్యం గొప్ప పాత్రను నిర్వహించిందనీ అన్నారు.

రూర్కెలలో నాటికోత్సవాలు

రూర్కెలాలో ఆంధ్ర ఎసోసియేషన్ ఆధ్వర్యాన మార్చి 9 నుంచి 12 వరకూ నాటికోత్సవాలు జరిగాయి. ఈ అయిదవ నాటికోత్సవంలో నాటికల ఏకపాత్రాభినయపోటీలు, తెలుగు పాటలు, తెలుగు పాటల పోటీలు జరిగాయి. ఆంధ్ర తుపాను బాధితుల సహాయార్థం ఈ ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. 15 నాటికలు 12 ఏకపాత్రాభినయాలు ప్రదర్శింపబడిన ఈ పోటీల్లో ఆంధ్ర, ప్రవాసాంధ్ర ఔత్సాహిక నాటక సంఘాలు పాల్గొన్నాయి. చివరి రోజు గోపాలరాజు భట్ అద్భుత నృత్య ప్రదర్శన జరిగింది.

సమీక్ష

'వెన్నెలలో కోనసీమ'

తొంభైఏడు కవితలున్న సోమసుందర్ గేయ సంపుటి 'గోదావరి పావనోదార భూతలము పసిడి వెన్నెల కోనసీమ వన్నెల పొలము' గురించి గానంచేస్తూ మొదలవుతుంది. ప్రతి గేయమూ సోమసుందర్ ముద్రాంకితంగా వుంటుంది. పట్టువిడవకుండా పాతిక—ముప్ఫయ్యేళ్ళుగా సాహిత్య సేద్యం చేస్తున్న సోమసుందర్ అభ్యుదయ భావవాది, అయినా భావకవితా శైలిపట్ల ఆయనకు మక్కువ ఎక్కువ. ఆయన పూర్వపు కవితా సంపుటాల్లాగానే, యీ సంపుటమూ అందుకు సాక్ష్యం. అడుగడుగునా కృష్ణశాస్త్రిగారి పోకడలు కనిపిస్తాయి.

ఈ కవి తన తొలి గీతాల సంపుటంలో (వజ్రాయుధం) ప్రజలగొంతుతో గొంతకలిపి నైజాం పాదుషాకు ఖబడ్దార్ చెప్పారు. ప్రజలతో కలిసి, అతని సింహాసనం కూలుతూ వుండటం చూశాడు. ఇటువంటివే గీతాలుండటం వల్ల ఆనాటి ప్రభుత్వం ఆ సంపుటాన్ని నిషేధించి సత్కరించింది.

అప్పటికీ, ఇప్పటికీ సోమసుందర్ అభ్యుదయ కాముకుడే. సమాజ సమూల పరివర్తనను కాంక్షించే కవే. కాని భావకవితా మాయా జాలం నుండి విముక్తుడు కావడం లేదు—పైగా అది మరింతగా ఆయనను బిగించి వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఈ సంపుటమంతటా ఆ పోకడలూ, ఆ పద చిత్రాలూ పంక్తి పంక్తికీ ఎదురవుతాయి. అవే కవి సమయాలు, నగిషీలు కనిపిస్తాయి. శైలి కూడా జటిల మవుతోంది.

వెన్నెలలో కోనసీమ 'విశ్వామిత్రుని ఎద' ను కరిగించి పాడిన మేనకలాగా, రంభలాగా, ఊర్వశిలాగా, గంధర్వకాంతలాగా కనిపించింది కవికి. అంతేనా? "నారికేళ హృదయమె నారికేళమైనదేమో" అన్నసందేహమూ పుట్టింది.

గోదావరి పాయలుగా చీలి, ఆ చీలిన పాయలు మనిషి తవ్విన కాలువల్లో పారి కోనసీమను గొప్ప సుక్షేత్రంగా చేసింది. కనుచూపు మేర ఎటుచూసినా పచ్చదనం, నిలువెత్తు పంటలు, గుత్తుల భారం మోస్తున్న రకరకాల పళ్ళ చెట్లు... వెన్నెల్లోనే కాదు, ఎండలోను కోనసీమ అందచందాల్ని మాటలలో పట్టుకోవడం తేలిక పని కాదు. అందుకోసం యీ గీతంలో గట్టి ప్రయత్నమే జరిగింది.

ఆకాశ రాజకీయం .... టి. ప్రసన్నకుమార్

అమావాస్య చీకట్లో
మినుకుమనే చుక్కలు
చీర కట్టిన చందమామపై
నేరారోపణ చేశాయి.
తమ వెన్నెల మొత్తం
దినకరుడి నుంచి దొంగిలించిందని ;
ఆకాశం కోర్టులో
మేఘాల బోనెక్కి
ఒట్టుపెట్టను పొమ్మంది
ఒంటిగా మిగిలిన జాబిలి
నీ ముఖాన మచ్చ ఉందంటే
మీ కళ్ళే మసక అంది
వత్తాసుకు రాలేదని
ప్రాణం తోడయిన పాల పుంతను
రెండు ముక్కలు చేసింది ;
చోద్యం చూసే చాతకాలు
ఇలా అనుకొన్నాయి :
"ఈ చీలికలన్నీ కలిసి
నింగికేం తెస్తాయి
ఇంద్ర ధనస్సునా ?
ఇంకా తమస్సునా ?

"శరత్కాల సురభిళ జ్యో
త్స్నాస్నా పులకితవిభావరులు
కొబ్బరాకు తళతళల
ముకురమ్ముల నెత్తైనహో!"

అయితే కోనసీమలోని ఇంత అందమూ యీ "గోదావరి పాపనో దారమూ." దానితో మానవుడు సృష్టిస్తున్న అపార సంపదా కోట్లకు పడగలెత్తి బుసకొడుతున్న భూస్వాముల పాలు, దళారులపాలై, ఆ సంపదల సృష్టికి కష్టించే వారు అభాగ్యులుగా మిగిలిపోయిన దృశ్యం కొస్తంతైనా పాఠకుడికి కవి చూపితే బాగుండును.

"ఆలోచన కొన దేరని - అంతరంగ మడవి...
సద్భావం ఉరకలిడని - స్వాంతము పెనుకడలి"

"సౌజన్యలేని యెడద
దివ్వె లేని ప్రమిద"

—వంటి పంక్తులు యీ కవి సౌందర్య పిపాసి మాత్రమే కాదు, చింతానావరుడు;

"ఇన్ని నాళ్ళ వేడి గాడ్పు
కన్నుల నుడికించి వేయ —
శీతల వాతుల సుధా
శీతల సేచన మొప్పగ" కురిసే వాన
"ఆనదలు అరిపేదలు చలి
గాలి కడరి రోదించగ
అంపేదల పూరిగుడిసె
అణగి కరగి మాయమవగ..."

పేద సాదల నెలా బాధ పెట్టిందో చెప్తూ 'సుభాశకర సేచనం, 'ఆనదల రోదనానికెలా కారణమవుతున్నదో - ఆ వైరుధ్యాన్ని చూపగల నిశిత దృష్టి కలవాడు కూడా అని తెలుపుతాయి.

(వెల రూ. 5
ప్రతులకు: కళా కేళి ప్రచురణలు, పిఠాపురం)

(సాధక్)

హేతువాద వ్యాససంకలనాలు

విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందినంతగా శాస్త్రీయ దృక్పథం పెంపొందడం లేదు. దీని మూలంగా మానవుడు నిత్య జీవితంలో జరుగుతున్న ప్రతివిషయాన్ని తరచి చూడలేక పోతున్నాడు. సమాజంలో మార్పుతీసుకు రావాలన్నా, ప్రజల్ని చైతన్యవంతుల్ని గావించాలన్నా హేతువాదదృక్పథం వారిలో కలిగించడం అవసరం. కావలి 'హేతువాద మిత్రులు' దాదాపు రెండేళ్ళగా యిందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికి వారు "మూఢనమ్మకాలు శాస్త్రీయ దృక్పథం", "హేతువాద వ్యాసాలు" "మృత్యువుపై సైన్సు దండయాత్ర" అనే మూడు వ్యాస సంకలనాలను ప్రచురించారు.

మతం అనేది మనిషిని కూపస్థ మండూకంగా వుంచి, మానసిక వికాసాన్ని అరికడుతుంది. మత విశ్వాసుల కార్యకలాపాల వల్ల విలువైన కాలం ఎంతో వృథా అవుతుందే తప్ప, మానవ పురోగతికే మాత్రం ఉపయోగపడదు అన్న విషయాన్ని మొదటి ప్రచురణలోని "మతం ఓ మత్తుమందు" అన్న వ్యాసంలో చక్కగా విశదీకరించబడింది. అదే సంకలనంలోని మరో వ్యాసం బాబాల మోసాల్ని బట్టబయలు చేసింది. రెండో ప్రచురణలో వివిధ అంశాలపైన హేతువాద దృక్పథాన్ని వివరించే వ్యాసాలు వున్నాయి. హేతువాద స్వరూపాన్నీ, శక్తినీ స్పష్టీకరించే రావిపూడి గారి వ్యాసం, హేతుదృక్పథంతో సృష్టి మూలాన్ని పరిశీలించిన డా. మిత్రాగారి వ్యాసం సైద్ధాంతిక ప్రబోధాలు.

ఈ ప్రచురణలో, ముఖ్యంగా శాస్త్రీయ వ్యాసాల్లోని సాంకేతిక పదాల్ని సాధ్యమైనంత వరకు తగ్గించి, మామూలు మాటల్లో వివరిస్తే సామాన్య పాఠకులు సులువుగా అర్థం చేసుకోడానికి వీలవుతుంది.

(ప్రతి వెల —0.50.
ప్రతులకు - వి. చెంచయ్య, రీసెర్చి స్కాలర్, తెలుగుశాఖ ఎస్.వి. విశ్వవిద్యాలయ కళాశాల తిరుపతి.)

(వి. సుబ్బయ్య)

లేఖలు

ఫిబ్రవరి సంచిక

ఫిబ్రవరి సంచికలో 'వితంతువుపాట్లు' కధానిక గొప్పగా వుంది. ఇతర భాషల్లోనివి ఇలాగే ప్రచురిస్తూ వుండండి. 'ధర్మం' అనే కథానిక ఎప్పుడో రావూరి భరద్వాజ రాసిన 'సత్తురూపాయి' కథను గుర్తు చేస్తుంది. ఆకధముందు ఈ 'ధర్మం' కథ నిలవదు- చాలా పేలవంగా అనుకరించినట్టుగా వుంది. చాప్లిన్ వ్యాసం, పాలస్తీనా కవితలు, దేవరాజు మహారాజు కవిత చాలా బాగున్నాయి.

టి. ఆర్. తిరుమల రెడ్డి, వరంగల్.

మార్చి సంచిక

ప్రపంచ నాటకకళ వికాసానికి బెర్టోల్ట్ బ్రెహ్ట్ చేసిన సేవ గణనీయమైనది. స్తానిస్లావ్‌స్కీ చేసిన సేవకు సరితూగగలది. ఆయన 80వ జన్మదినోత్సవ సందర్భంగా 'అభ్యుదయ' ఆయన చిత్రాన్ని ముఖపత్రంమీద ముద్రించి, ఆయన గురించి కొన్ని రచనలు, ఆయనపద్యానువాదాలు కొన్ని ప్రచురించడం హర్షించవలసిన విషయం. మన దేశంలోనూ, మన రాష్ట్రంలోనూ బ్రెహ్ట్ గురించి తెలిసినది చాలా తక్కువ. నాటక రంగానికి చెందినవారిలో ఏ కొద్దిమందో తప్పితే బ్రెహ్ట్‌ను ఎరిగిన వారు కనిపించరు. 'అభ్యుదయ' ప్రచురించిన సమాచారం సమగ్రం కాకపోయినా, బ్రెహ్ట్ అధ్యయనానికి కొంతగానైనా తోడ్పడుతుంది.

నాటక కళాభిమాని, విశాఖపట్నం

బంకిం-టాగోర్-గురజాడ
దేశభక్తి గీతాలు

బంకిం, టాగోరులు దేశాన్ని కవితా స్వరూపంలోనే దర్శించారు. (చూ. గత సంచికలోని, అంతర్జాతీయ గీతం కాదగిన గురజాడ దేశభక్తి గీతం.) వాళ్ళ నిజాయితీని శంకించనక్కరలేదు. వాళ్ళు ప్రజావాహినిమీద చిన్నచూపుగలవాళ్ళని డానికి నిదర్శనాలు లేవు గదా! వాళ్ళు వాడిన పదాలు పూర్తిగా వ్యంజకాలు; సంకేతాలూను. గురజాడ పదాలకు వాచక ధర్మం ఎక్కువ. అందుకు కారణం ఆయనలో కవితాత్మ లేకపోవడం కాదు (విశ్వనాధ అనుయాయులనుకున్నట్లు) మరి చారిత్రక కారణాలవల్లనూ వాస్తవికతా దృష్టివల్లనూ ఆయన చాలా స్పష్టంగా చెప్పవలసి వచ్చింది. ఇందులోనే ఈయన నవ్యత, క్రాంతదర్శనం, ప్రజాస్వామిక యువచైతన్యం ఉన్నాయి. బంకిం, రవీంద్రులది కాల్పనిక భిత్తికకు వేలాడుతున్న కవితాచిత్రం. వ్యాఖ్యానిస్తే అందులోనే దేశభక్తి, ప్రజానురక్తి ఉట్టిపడతాయి. ఏ కవిత్వమైనా వ్యాఖ్యానంవల్ల సంజీవిత మవుతుంది. కవిత్వం మాత్రమే కించపరచదగింది.


మిరియాల రామకృష్ణ కాకినాడ

గోష్ఠి

ఏప్రిల్ 2, ఆదివారం

స్వీయ కథానికా పఠనం

పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో (లజ్) సాయంత్రం 6 గంటలకు


దాసరి నారాయణరావు
దేవీ ఆర్ట్ పిక్చర్స్
దేవదాసు మళ్ళీ పుట్టాడు
ఈస్ట్మన్ కలర్
నిర్మాతలు:
శ్రీనివాసులు
పాండురంగడు
సంగీతం: స.రాజేశ్వరరావు
-తారకరామ
THARAKARAMA
Bachi



బాతిక్ చిత్రం

Edited and Published By T. Venkataramiah, at 15, Arulammal Street Madras-600017 and Printed at Sri Venkateswara Printers, Madras-600021